శనివారం
03-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 43
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సాగుపై అంతర్జాతీయ సదస్సు నేడు

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగ ఆర్థికవేత్తల సదస్సు (ఐసీఏఈ) శనివారం జరగబోతోంది. 32వ ఐసీఏఈ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఇటువంటి కార్యక్రమం 65ఏళ్ల తర్వాత దేశంలో జరుగుతోందని అధికారిక ప్రకటన శుక్రవారం తెలిపింది. అంతర్జాతీయ వ్యవసాయ రంగ ఆర్థికవేత్తల సమాఖ్య అధ్వర్యంలో ఆరు రోజుల పాటు సమావేశాలు జరగనున్నాయి. 'సుస్థిర సేద్యం-ఆహార వ్యవస్థల దిశగా సంస్కరణలు' థీమ్‌తో వీటిని నిర్వహిస్తున్నారు. 75 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారు. వాతావరణ మార్పు, సహజ వనరుల క్షీణత, పెరిగిన సాగు వ్యయం, ఘర్షణల వంటి అంతర్జాతీయ సవాళ్ల దృష్ట్యా సుస్థిర వ్యవసాయ లక్ష్యాల సాధనే ఈ సదస్సు ఉద్దేశమని ప్రకటన వెల్లడించింది.

విద్యార్థుల మృతిపై సీబీఐ దర్యాప్తు

ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ సెల్లార్‌ను వరద ప్రవాహం ముంచెత్తి ముగ్గురు సివిల్ సర్వీసెస్ విద్యార్థులు మృతి చెందిన ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. సీబీఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు, సకాలంలో దర్యాప్తు పూర్తి చేసేందుకు ఒక అధికారిని నియమించాలని విజిలెన్స్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. 'ఘటన జరిగిన తీరు, విచారణపై ప్రజలకు ఎలాంటి

- మిగతా 2 లో

త్వరలో కొత్త 'మద్యం'

అక్టోబరు1 నుంచి అమలుకు యత్నం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన మద్యం విధానం రూపకల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో అమలైన విధానాల్ని పూర్తిగా సంస్కరించి...వినూత్నంగా మద్యం విధానం తీసుకురావాలని కసరత్తు చేస్తోంది. వీలైతే అక్టోబరు 1

- మిగతా 2 లో

వ్యవస్థీకృత ఉల్లంఘన లేదు

నీట్ పరీక్షలపై సుప్రీం

న్యూఢిల్లీ: ప్రశ్న పత్రాల లీకేజీ ఆందోళనల మధ్య వివాదాస్పదమైన నీట్-యూజీ 2024 పరీక్షను రద్దు చేయడం లేదని సుప్రీం కోర్టు శుక్రవారం తెలిపింది. పరీక్షలో వ్యవస్థీకృత ఉల్లంఘన జరగలేదని, ప్రశ్న పత్రాల లీకేజీ కేవలం పాట్నా, హజారిబాగ్‌లో మాత్రమే జరిగిందని వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో పాటు కేంద్ర సర్కారు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సూపర్-6కు నిధులేవి?

- రూ.1,29,972 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- అన్నా క్యాంటీన్లు, ఇతర అవసరాలకే కేటాయింపులు
- తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా సంక్షేమ పథకాలపై మౌనం
- లబ్ధిదారుల ఎదురు చూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వానికి ఆరంభంలోనే ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధాన అంశాల ఊసులేదు. రాబోయే నవంబరు 31వరకు కూటమి ప్రభుత్వం రూ.1,29,972 కోట్లకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. తొలి ఓటాన్ అకౌంట్‌కు సంబంధించి రూ.1,07,545 కోట్లకు ఆమోదం తెలపగా... దానికి ఈ నాలుగు నెలలకుగాను రూ.22,427 కోట్లను కలిపి మొత్తంగా రూ.1,29,972 కోట్లకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం నవంబరు వరకు వెరసి దాదాపు ఆరు నెలలపాటు మేనిఫెస్టోలోని నెలవారీ సంక్షేమ పథకాల అమలు ప్రశ్నార్థకంగా మారింది. నవంబరు తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి...ఏవేవీ అమలు చేయాలనే దానిపై ప్రణాళికా బద్ధంగా వెళ్లే ఆలోచనలు కన్పిస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీలోను, బయట బహిరంగ సభల్లోను సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే భయమేస్తోందని వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం. హామీలైతే భారీగా ఇచ్చాంగానీ అమలు చేయడమే భారంగా ఉందని... ఆర్థిక పరిస్థితులు బాగోలేదని, ప్రజలు సహకరించాలన్న చంద్రబాబు వ్యాఖ్యలతో మేనిఫెస్టో అమలు ప్రశ్నార్థకంగా మారింది. కాగా సీఎం వ్యాఖ్యలను వైసీపీతోపాటు విపక్ష పార్టీలు తప్పుబట్టాయి. ఎన్నికల మేనిఫెస్టో రూపొందించే నాటికి అనుభవం గల సీఎం చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తెలియవా? అని ప్రశ్నిస్తున్నాయి. ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిందేనని నిలదీస్తున్నాయి. అటు విద్యా సంబంధిత హామీలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పకడ్బందీగా అమలు చేస్తామని మంత్రి నారా లోకేశ్ శాసన మండలిలో

- మిగతా 2 లో

సంపద సృష్టే ముఖ్యం

అలాంటి వారికే రాజధానిలో భూములు

- జీవో నం.207 ప్రకారమే సీఆర్డీఏ పరిధి
- రాజధాని రైతులకు మరో ఐదేళ్ల కౌలు పొడిగింపు
- అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంపద సృష్టికి కేంద్రాలుగా అమరావతి ప్రాంతాన్ని మార్చేవారికే భూ కేటాయింపులు జరపాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. రాజధాని ప్రాంతంలో గతంలో జరిపిన భూ కేటాయింపులపై పునః సమీక్ష ఆసక్తి చూపే, పెట్టుబడులు పెట్టగలిగే సంస్థలకే అవకాశం ఇవ్వాలన్నారు. 2015లో ఇచ్చిన జీవో నెంబర్ 207 ప్రకారం 8,352 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే సీఆర్డీఏ ఉంటుందని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. గతంలో గుర్తించిన విస్తీర్ణం ప్రకారమే సీఆర్డీఏ పరిధి కొనసాగుతుందన్నారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 36వ అథారిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 12 అంశాలపై చర్చించారు. గతంలో 130 సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. గతంలో భూములు పొందిన వాళ్లు మళ్లీ ఎన్నిరోజుల్లో నిర్మాణాలు చేపట్టాలి అనే అంశంపైనా చర్చించారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే కౌలును, అలాగే రాజధాని ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు అందిస్తున్న పెన్షన్లు కూడా మరో ఐదేళ్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. అమరావతిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ఎటువంటి సంస్థలను ఆహ్వానించాలి, ఎవరికి భూములు కేటాయించాలి అనే అంశంపైనా సీఎం చర్చించారు. దేశంలో టాప్ 10 కళాశాలలు, టాప్ 10 పాఠశాలలు, టాప్ 10 ఆసుపత్రులు అమరావతిలో ఏర్పాటు కావాలని సీఎం అభిప్రాయపడ్డారు. మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపిన వివిధ గ్రామాలను మళ్లీ రాజధాని పరిధిలోకి తీసుకురావాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గత ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలపై లోతైన సమీక్ష జరుపుతున్నామని తెలిపారు. జగన్ ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన ఆర్ 5 జోన్‌పైనా అధికారులు చర్చించారు. గత ప్రభుత్వం చట్టవ్యతిరేక నిర్ణయాలపై లోతైన సమీక్ష జరపాలని అధికారులు పట్టుబట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, 4 లైన్లుగా కరకట్ట నిర్మాణంపై ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అనంతరం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ మీడియాకు సీఆర్డీఏ అథారిటీ నిర్ణయాలు వెల్లడించారు.

ఎక్సైజ్‌లో గత ప్రభుత్వ అక్రమాలపై సీఐడీ విచారణ

సీఎం చంద్రబాబు సచివాలయంలో ఎక్సైజ్ శాఖపైనా సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు జరిపిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటికే దీనిపై నిర్ణయం తీసుకున్నందున గత ఐదేళ్లలో జరిగిన లావాదేవీలపై అన్ని ఫైళ్లు సీజ్ చేయాలని, త్వరలో ప్రారంభమయ్యే సీఐడీ విచారణకు ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. ఊహించని స్థాయిలో ఐదేళ్లలో మద్యంలో అక్రమాలు జరిగాయని, దీనిపై అన్ని లావాదేవీలు సీఐడీకి అందించాలన్నారు. ప్రజల ప్రాణాలు తీసే నాణ్యత లేని మద్యం ఇక రాష్ట్రంలో కనిపించడానికి వీల్లేదని స్పష్టంచేశారు. ఎన్నికల్లో చెప్పినట్లు నాణ్యతలేని మద్యం రాష్ట్రంలో లేకుండా చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, తద్వారా ప్రజల

- మిగతా 2 లో

ఎన్నికల బాండ్లపై సిట్ కుదరదు

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లపై కోర్టు పర్యవేక్షణలోని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజకీయ పార్టీలు, కార్పొరేట్ దాతల మధ్య క్విడ్ ప్రో కో జరిగిందంటూ వచ్చిన ఆరోపణపై న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని దాఖలైన అనేక పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. సాధారణ చట్టం కింద చర్యలు తీసుకునే మార్గాలు ఉన్నప్పటికీ... దీనిపై మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించడం అనుచితమే అవుతుందని పేర్కొంది. ఆర్టికల్ 32 ప్రకారం ఈ దశలో జోక్యం చేసుకోవడం తొందరపాటే అవుతుందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు స్వీకరించిన విరాళాలను రికవరీ చేయడంతోపాటు... వాటి ఆదాయపన్ను మదింపులను తిరిగి తెరవాలని పిటిషనర్లు కోరడాన్ని సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆదాయపు పన్ను చట్టం కింద ఇవి సంబంధిత శాఖ అధికారులకు సంబంధించిన చర్యలని పేర్కొంది. ఎన్నికల బాండ్ల వ్యవహారంలో క్విడ్ ప్రో కో జరిగి ఉండవచ్చనే ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని కోరుతూ సుప్రీం కోర్టులో నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని పరిశీలించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం... సిట్ ఏర్పాటుకు నిరాకరించింది.

నాపై ఈడీ దాడులు

- అదే జరిగితే చాయ్, బిస్కెట్లతో ఆహ్వానిస్తా
- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్రంపై సంచలన ఆరోపణలు చేశారు. మోదీ సర్కారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను తనపై ప్రయోగించబోతోందన్నారు. ఈ మేరకు ఈడీ సోదాలకు సిద్ధమవుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేసే కొందరు విశ్వసనీయ వ్యక్తుల నుంచి తనకు ఈ సమాచారం అందిందని వెల్లడించారు. దీనికి కారణం లోక్‌సభలో తన చక్రవ్యూహ్ ప్రసంగమేనని ఆయన చెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "నాపై ఈడీ దాడులు జరగొచ్చు. ఓ అధికారి నుంచి నాకు దానిపై సమాచారం వచ్చింది. జులై 29న నేను పార్లమెంటులో చేసిన 'చక్రవ్యూహం' స్పీచ్ కొందరికి నచ్చలేదు. ఈడీ విచారణ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా... అదీ ఛాయ్ బిస్కెట్లతో " అని

- మిగతా 2 లో

రాహుల్‌ను టచ్ చేస్తే ఊరుకోం

ఎంపీ ప్రియాంక చతుర్వేది

- 2లో

ఉంటారా... ఫిరాయిస్తారా

- దిక్కులు చూస్తున్న వైసీపీ ఎంపీలు
- రాజ్యసభలో 11 మంది బలం
- టీడీపీ నేతలతో సంప్రదింపులు?
- అధిష్ఠానం అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ రాజ్యసభ సభ్యులు దిక్కులు చూస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది. అందరూ నమ్మిన వారికే అధిష్ఠానం పదవులు కేటాయించగా, ఉంటారా... ఫిరాయిస్తారా అనేదీ వైసీపీలో కలవరంగా మారింది. టీడీపీలోకి కొందరు ఫిరాయిస్తారనే ఊహాగానాలు సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా నడుస్తున్నాయి. వైసీపీ అధికార మీడియా కూడా అప్రమత్తమై... తమ పార్టీ ఎంపీలకు టీడీపీ ఎర వేస్తోందంటూ ఒక కథనం రాసింది. అంతటితో ఆగకుండా వైసీపీ రాజ్యసభ ఎంపీలకు ఒక్కొక్కరికీ రూ.70 కోట్లు ఇచ్చేలా సంప్రదింపులు చేస్తున్నట్లుగా తెలిపింది. దీనికితోడు సామాజిక మాధ్యమాల్లోను వైసీపీ రాజ్యసభ ఎంపీల్లో కొందరు చేజారిపోయే అవకాశం ఉన్నట్లు కోడై కూస్తోంది. ఎందరు వెళ్తారో, ఎవరు ఉంటారో తెలియక ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాజ్యసభలో వైసీపీకి 11 ఎంపీలున్నారు. వారిలో వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వి.విజయసాయిరెడ్డి, ఆర్.కృష్ణయ్య, ఎస్.నిరంజన్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమిల నత్వానీ ఉన్నారు. ఇందులో వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి పదవీ కాలం

- మిగతా 2 లో

నిన్న లీక్... నేడు వరద

కొత్త పార్లమెంట్ భవనం దుస్థితి | **విపక్షాల వ్యంగ్యాస్త్రాలు**

న్యూఢిల్లీ: మోదీ సర్కారు కోట్లాది రూపాయాల ఖర్చుతో...భారీ ప్రచారంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొత్త పార్లమెంటు భవనం లీకులు, వరదతో అభాసుపాలవుతోంది. ప్రజాసమస్యలపై చర్చలు జరిపే లోక్‌సభ తాజాగా వార్తల్లో నిలిచింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా కొత్త పార్లమెంట్ భవనం గురించే జోరుగా చర్చ

జరుగుతోంది. దిల్లీలో కొద్దిరోజులుగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. దేశ రాజధానిలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల్లో పార్లమెంటు నూతన భవనం కూడా చిక్కుకుపోయింది. కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనం వరద నీటిలో చిక్కుకుంది. కొద్దిపాటి వర్షానికి భవనంలోపలికి వర్షపు నీరు వచ్చి చేరి ఇబ్బందికరంగా మారిపోయింది. గురువారం భవనం పైకప్పు లీకై నీరు రాగా... శుక్రవారం ఏకంగా పార్లమెంటులోకి వరద నీరు వచ్చి చేరింది. పార్లమెంట్ నూతన భవనంలో వర్షపు నీటికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దాదాపు రూ. 970 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని ఏడాది క్రితం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.

కాగా, ఈ అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ గురువారం లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను

- మిగతా 2 లో

గెలిచింది గోంజాల్వెజ్

అమెరికా, బ్రెజిల్, కొలంబియా, మెక్సికో వాదన

వివాదాస్పదంగా వెనిజులా అధ్యక్షుడి ఎన్నిక

కారకస్/వాషింగ్టన్: వెనిజులా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై వివాదం ముదిరింది. నికోలాస్ మదురోను వెనిజులా అధ్యక్షుడిగా గుర్తించేందుకు అమెరికా, బ్రెజిల్, కొలంబియా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ నిరాకరించాయి. ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించినది విపక్ష అభ్యర్థి ఎడ్మండో గోంజాల్వెజ్ అని పేర్కొన్నాయి. గోంజాల్వెజ్ గెలిచినట్లు భావించాయి. అధ్యక్ష ఎన్నికల్లో మదురో గెలిచినట్లు వెనిజులా ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. కానీ మదురో ఎన్నికను నిరాకరిస్తున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అమెరికా సరసన బ్రెజిల్, కొలంబియా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ చేరాయి. గోంజాల్వెజ్ విజేతని పేర్కొన్నాయి. జులై 28న అధ్యక్ష ఎన్నికలు జరిగిన విషయం విదితమే. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఓ ప్రకటనలో మదురో ఎన్నికను తిరస్కరించారు. అత్యధిక ఓట్లు గోంజాల్వెజ్‌కు దక్కాయని వెనిజులా ప్రజలతో పాటు అమెరికాకు స్పష్టత లభించిందని తెలిపారు. 2013 నుంచి వెనిజులా అధ్యక్షుడిగా మదురో ఉన్నారు. తాజా ఎన్నికల్లో 51శాతం ఓట్లతో గెలుపొందారు. ప్రతిపక్ష లెక్క ఇందుకు భిన్నంగా ఉంది. 90శాతం ఓట్లు గోంజాల్వెజ్‌కు వచ్చినట్లు తెలిపింది. మదురో కంటే ఆయనకు రెట్టింపు మద్దతు

లభించినట్లు వెల్లడించింది. ఈ మేరకు సమగ్ర వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచింది. అభ్యర్థికి వచ్చిన మొత్తం ఓట్లకు మించి ఎలాంటి సమాచారాన్ని ప్రభుత్వం పంచుకోలేదు. దీంతో అనేక అనుమానాలు ఉత్పన్నమయ్యాయి. పౌరులు తమ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకోకుండా అడ్డుకునేందుకు, రాజకీయ హింసకు అస్త్రాలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్, భద్రతా దళాలు ఉండరాదని బ్లింకెన్ పేర్కొన్నారు. తాజా వివాదం వల్ల ఓట్ల వివరాలు బహిర్గతం చేయాలని వెనిజులాకు బ్రెజిల్, మెక్సికో, కొలంబియా అధ్యక్షులు సూచించారు. మదురోకు వ్యతిరేకంగా చేసిన ప్రకటన కారణంగా పెరుతూ వెనిజులా తెగతెంపులు చేసుకున్న విషయం తెలిసిందే.

ఆందోళనలకు విపక్ష నేత మారియా పిలుపు

వెనిజులా అధ్యక్షుడిగా మదురో తిరిగి ఎన్నిక కావడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ప్రతి నగరంలో ఆందోళనలు చేపట్టాలంటూ తమ వర్గాలకు ప్రతిపక్ష పార్టీ నేత మారియా కొరీనా మచాడో పిలుపునిచ్చారు. న్యాయంగా గెలిచింది గోంజాల్వెజ్ అని... చాలా వరకు పోలింగ్ కేంద్రాల డేటా ఇదే చెబుతున్నట్లు వెల్లడించారు. నిరంకుశత్వాన్ని వ్యతిరేకించే.... ప్రజాస్వామ్యానికి మద్దతిచ్చే వారంతా వెనిజులా ప్రజల న్యాయమైన పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ముదరో గెలుపుతో తన ప్రాణానికి ముప్పు ఉన్నందున అజ్ఞాతవాసంలో ఉన్నట్లు ఆమె 'వాల్ స్ట్రీట్ జర్నల్'లో పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత వెనిజులాలో చెలరేగిన హింసలో 20 మంది ప్రాణాలు కోల్పోగా వెయ్యి మందికిపైగా అరెస్టుకు గురైనట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాలపై విచారణ జరిపించి, వాటిని ధ్రువీకరించే ప్రక్రియను చేపట్టాలని మదురో కోరడంతో అధ్యక్ష ఎన్నికల అభ్యర్థులందరికీ వెనిజులా అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం సమన్లు జారీచేసింది.

'ఉగ్ర' దేశంగా క్యూబా పేరు తొలగింపు

అమెరికాకు కేకేఈ యూరో పార్లమెంటు గ్రూపు డిమాండ్

ఏథెన్స్: ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితాలో క్యూబా పేరు చేర్చడాన్ని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) యూరో పార్లమెంటు గ్రూపు తీవ్రంగా ఖండించింది. తక్షణమే క్యూబాను ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కమిషన్ వీపీ జోసెఫ్ బోర్రెల్ ఒక ప్రకటన వెలువరించారు. దశాబ్దాలుగా క్యూబాపై ఆ దేశ ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను దుయ్యబట్టారు. అమెరికా ఆంక్షల వల్ల క్యూబా ప్రజల జీవనం దుర్భరమైందని పేర్కొన్నారు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని, అభివృద్ధి కుంటుపడిందని, ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించాయని ఆందోళన వ్యక్తంచేశారు. నేరపూరితంగా ఆర్థిక-వాణిజ్యపరమైన ఆంక్షలు విధించడమే తమ వ్యూహంగా క్యూబాపై అమెరికా అక్కసు కొనసాగుతోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా క్యూబా అమెరికా ముద్రవేసిందని, 2021 నుంచి

క్యూబాను ఆ జాబితాలో చేర్చిందని గుర్తుచేశారు. అప్పటి ట్రంప్ యంత్రాంగం ఇప్పటి బైడెన్ ప్రభుత్వం కూడా క్యూబాను ఆంక్షల వలయంలోకి మరింతగా నెట్టివేసినట్లు తెలిపారు. క్యూబాపై అన్ని రకాల ఆంక్షలు ఎత్తివేయాలని, ఆ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని మానుకోవాలని అమెరికాకు యూరో పార్లమెంటు గ్రూపు స్పష్టంచేసింది.

హమాస్ నేత హత్యతో ప్రయోజనం లేదు: బైడెన్

వాషింగ్టన్: హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనీయే హత్యతో గాజాలో కాల్పుల విరమణకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభిప్రాయపడ్డారు. ఇస్మాయిల్ హత్యతో పోరు మరింత తీవ్రరూపం దాల్చగలదని, సుదీర్ఘ కాలం సాగేందుకు వీలు ఉంటుందని గాజా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం జరిగిన కొన్ని గంటల్లోనే ఇస్మాయిల్ హత్యకు గురైనట్లు ఇరాన్ వెల్లడించింది. ఇస్మాయిల్ హనీయే హత్య వల్ల కాల్పుల విరమణకు ఉన్న అవకాశాలు సన్నగిల్లాయా అని విలేకరులు



ప్రశ్నించగా దీని వల్ల ఫలితం ఉండదు అని బైడెన్ బదులిచ్చారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో నేరుగా సంభాషించినట్లు తెలిపారు. ఈ హత్యతో తమకు సంబంధం ఉన్నట్లు నెతన్యాహు చెప్పలేదు కానీ హమాస్, హెజ్బుల్లాను కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలావుంటే ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 40వేల మంది పలస్తీనియన్లు చనిపోగా, 2.3 మిలియన్ల మంది నిరాశ్రయులయ్యారు. మరోవైపు ఇస్మాయిల్ హనీయే హత్య వెనుక తమ హస్తం లేదని అమెరికా స్పష్టంచేసింది.

నిన్న లీక్... నేడు వరద

(మొదటిపేజీ తరువాయి)

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. 'కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా...' అంటూ అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. 'బయట పేపర్ లీక్... లోపల వాటర్ లీక్... పార్లమెంటు భవనం నిర్మించి ఏడాది పూర్తి కాకుండానే లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది' అని ఎద్దేవా చేశారు. అయితే పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి... వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కాగా, సెంట్రల్ విస్టా రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ కొత్త పార్లమెంట్ భవనాన్ని మోదీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్మించారు. భారీ ఖర్చుతో 64,500 చదరపు మీటర్ల స్థలంలో ఈ భవనాన్ని నిర్మించారు. గతేడాది మే 23వ తేదీన ప్రధాని ఈ సెంట్రల్ విస్టా భవనాన్ని ప్రారంభించారు.

త్వరలో కొత్త 'మద్యం'

(మొదటిపేజీ తరువాయి)

నుంచి అమలులోకి తేవాలన్న లక్ష్యంతో ఉంది. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో మద్యం విధి విధానాలను పరిశీలించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు నాలుగు బృందాలను రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున అధికారులు ఉంటారు. ఆయా రాష్ట్రాల్లో ఎక్సైజ్ పాలసీ, మద్యం షాపులు, బార్లు, ధరలు, మద్యం కొనుగోళ్లు, నాణ్యత తదితర అంశాలపై ఈ బృందాలు అధ్యయనం చేస్తాయి. వీటితోపాటు డిజిటల్ పేమెంట్ల చెల్లింపుపైనా ఆరా తీస్తారు. ఇందుకు సంబంధించి ఈనెల 12లోగా నివేదికలు అందజేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అన్నీ కుదిరి, నూతన మద్యం విధానం ఒక స్పష్టత వస్తే వచ్చే అక్టోబరు 1 నుంచి కొత్త విధానం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. గత ప్రభుత్వం నాసిరకం మద్యాన్ని విక్రయించడమే కాక... వాటిని అధిక ధరలతో విక్రయించిందని మద్యం ప్రియులు గగ్గోలు పెట్టారు. చాలా మంది వాటిని తాగి అనారోగ్యానికి గురై మృతి చెందిన సంఘటనలున్నాయి. దీంతో గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది.వారి కోరిక మేరకు తక్కువ ధరకు మద్యం విక్రయాలు కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక కొన్ని కొత్త బ్రాండ్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అయితే అవి కూడా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నవేనన్న విమర్శలున్నాయి. దీంతో రాబోయే నూతన మద్యం విధానం ఏరకంగా ఉంటుంది?, మద్యం ధరలతోపాటు నాణ్యత ఎలా ఉంటుందనే విషయమై మద్యం ప్రియుల్లో చర్చ సాగుతోంది.

ఉంటారా... ఫిరాయిస్తారా

(మొదటిపేజీ తరువాయి)

ఒకటి ఏప్రిల్, 2030 వరకు ఉంది. వి.విజయసాయిరెడ్డి, ఆర్.కృష్ణయ్య, ఎస్.నిరంజన్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు రాజ్యసభలో 21 జూన్, 2028 వరకు కొనసాగుతారు. ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమి నత్వాని పదవిలో 21 జూన్, 2026 వరకు ఉంటారు. విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి జగన్‌తోనే కలిసి నడుస్తున్నారు. అలాంటి వారిద్దరూ పార్టీ వీడతారనే ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నారు. బీసీ వర్గాలకు చెందిన మోపిదేవి వెంకట రమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్ జగన్‌కు నమ్మినబంటుగా మెలుగుతున్నారు. గొల్ల బాబూరావు సుదీర్ఘకాలంపాటు వైసీపీలో కొనసాగుతున్నారు.

ప్రస్తుతమున్న వారంతా జగన్‌కుగాని, వైఎస్ఆర్ కుటుంబానికిగాని ఏదోఒక సంబంధంతో ఉన్నవారే. అలాంటి వారంతా ఒక్కసారిగా పార్టీ ఫిరాయిస్తారన్న ఊహాగానాలు రావడంతో వైసీపీ అధిష్ఠానం అప్రమత్తమైనట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎంపీల బలమూ చేజారింది. 25 ఎంపీల్లో కేవలం నాలుగు ఎంపీలనే వైసీపీ గెలుచుకోగా, మిగిలిన ఎంపీలను కూటమి నేతలు దక్కించుకున్నారు. అటు రాజ్యసభలో మాత్రం వైసీపీకి 11 ఎంపీలతో పూర్తిస్థాయి మెజార్టీ ఉంది. టీడీపీ జీరో స్థానంతో ఉంది. రాబోయే రెండేళ్ల వరకూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముంది. టీడీపీ రాజకీయ చరిత్రలో రాజ్యసభలో జీరో స్థానంతో ఉన్న పరిస్థితులు గతంలో ఉన్నదూ లేవు. వైసీపీ రాజ్యసభ ఎంపీలను బీజేపీలోకి ఆహ్వానించే పరిస్థితులు లేవు. వారెక్కడున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రవేశపెట్టిన వివిధ బిల్లులకూ లోక్‌సభ, రాజ్యసభలో వైసీపీ ఎంపీలు పూర్తి స్థాయి మద్దతిచ్చి అభాసుపాలయ్యారు. దీంతో వైసీపీ రాజ్యసభ ఎంపీలతో కొందరు టీడీపీ నేతలు టచ్‌లో ఉన్నట్లు ప్రచారం. అదే జరిగితే ముగ్గురు నుంచి ఆరుగురు చేజారిపోతారని సమాచారం.

దీనిని పార్టీ అధిష్ఠానం తేలిగ్గా తీసుకోకుండా, వారిని పిలిపించి మాట్లాడే ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు తెలిసింది. ప్రస్తుతమున్న రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురికి వ్యాపార పరంగా ఉండటం వల్ల, రాష్ట్ర ప్రభుత్వంతో అవసరాలు ముడిపడి ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వారేమైనా పార్టీ వీడతారా? అనేదీ గందరగోళంగా మారింది. టీడీపీలోకి ఎవరైనా వెళ్తే, తక్షణమే వారితో రాజీనామా చేయించి, ఆ తర్వాత వచ్చే ఖాళీ స్థానాన్ని వారితోనే భర్తీ చేయించేలా ప్రణాళిక రూపొందించినట్లుగా విశ్వసనీయ సమాచారం.

రాహుల్‌ను టచ్ చేస్తే ఊరుకోం

ఎంపీ ప్రియాంక చతుర్వేది

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై దాడులు చేయాలని యోచిస్తోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఆయనకు మద్దతుగా నిలిచింది. కాంగ్రెస్ నాయకుడి ఇంటి తలుపులను దర్యాప్తు సంస్థ తట్టినట్లయితే... ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తారని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది శుక్రవారం స్పష్టం చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల నుంచి అధికార బీజేపీ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని, కేంద్ర సంస్థల చర్యలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చతుర్వేది హెచ్చరించారు. 'ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసేందుకు అన్ని దర్యాప్తు సంస్థలను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు. నేడు మన కేంద్ర సంస్థలన్నీ కేంద్ర ప్రభుత్వానికి తలవంచాయి' అని రాజ్యసభ సభ్యురాలు పేర్కొన్నారు. 'లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉంటూ రాహుల్ గాంధీ ప్రజలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తుతున్నారు. ఒకవేళ ఈడీ రాహుల్ గాంధీ తలుపు తడితే, ఇండియా ఐక్య సంఘటనలోని భాగస్వాములందరూ దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారు' అని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన విమర్శనాత్మక 'చక్రవ్యూహ' ప్రసంగం తర్వాత తనపై ఈడీ దాడికి యోచిస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈడీ 'అంతరంగికులు' ప్రణాళికాబద్ధమైన దాడి గురించి తనకు తెలియజేసినట్లు రాహుల్ గాంధీ 'ఎక్స్' లో పేర్కొన్నారు. దానికి ఆయన ప్రతిస్పందిస్తూ దర్యాప్తు సంస్థ కోసం 'ముక్త హస్తాలతో' వేచి ఉంటానని, వారికి టీ, బిస్కెట్లు కూడా అందజేస్తానని చెప్పారు. బడ్జెట్ చర్చ సందర్భంగా గాంధీ బీజేపీని విమర్శించడానికి 'చక్రవ్యూహ' అనే మహాభారత భావనను ఉపయోగించారు. కమలం రూపంలో ఆధునిక కాలపు 'చక్రవ్యూహాన్ని' బీజేపీ రూపొందించిందని, ఇది బీజేపీ గుర్తుకు స్పష్టమైన సూచనగా ఉందని ఆయన వాదించారు. యువత, మహిళలు, రైతులు, చిన్న, మధ్య తరహా వ్యాపారాలతో సహా భారతీయ సమాజంలోని వివిధ రంగాలను ప్రభుత్వం ఉచ్చులోకి నెట్టిందని ఆయన విమర్శించారు.

మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా ఆరుగురు వ్యక్తులు ఈ చక్రవ్యూహానికి కేంద్రంగా ఉన్నారని గాంధీ పేర్కొన్నారు. ఆయన మరో నలుగురి పేర్లను చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ, వారు సభలో సభ్యులు కాదనే కారణంతో స్పీకర్ ఓం బిర్లా దానిని అనుమతించలేదు. తరువాత 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో గాంధీ... 'ఈ రోజు 21వ శతాబ్దపు కమలం ఆకారంలో ఉన్న చక్రవ్యూహం భారతదేశాన్ని ఉచ్చులో బిగిస్తోంది. నరేంద్ర మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ, అజిత్ దోవల్, మోహన్ భగవత్‌చే నియంత్రించబడుతుంది' అని పేర్కొన్నారు.

విద్యార్థుల మృతిపై సీబీఐ దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

అపోహలు లేకుండా చూసేందుకు ఈ కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నాం' అని కోర్టు పేర్కొంది. కేంద్ర విజిలెన్స్ కమిషనర్ తన అధికారాలతో దర్యాప్తు పర్యవేక్షణకు ఒక సభ్యుడిని నియమించాలని ఆదేశించింది. ఢిల్లీలో మురుగుకాలువల వంటి మౌలిక సదుపాయాలు తగినంతగా లేవని, నిర్వహణ కూడా దయనీయంగా ఉందని, పౌర సంస్థల్లో చిత్తశుద్ధి లోపించడం వల్లే ఇటీవల విషాద ఘటనలకు కారణమవుతోందని కోర్టు అభిప్రాయపడింది. రాజేందర్ నగర్‌లోని కోచింగ్ సెంటర్‌ను వరద నీరు ముంచెత్తి ఈనెల 27వ తేదీ సాయంత్రం శ్రేయ యాదవ్, తాన్యా సోని, నెవిన్ డాల్విన్ అనే ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి వివిధ కోచింగ్ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు నిరసన బాట పట్టారు. తమ ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న కోచింగ్ సెంటర్లలో భద్రతా చర్యలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

'సూపర్-6'కు నిధులేవి?

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. దీని ప్రకారం ఈ విద్యా సంవత్సరానికి తల్లికి వందనం పథకం లేనట్లేననే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో మేనిఫెస్టోలో వాగ్దానం మేరకు రూ.3వేల పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి... ఈ రెండు నెలల వరకు కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను ఒకటో తేదీన అందరికీ పడపోయినప్పటికీ, కొంచెం అటూ, ఇటూగా అందరి ఖాతాల్లో వేసి వారి మన్ననలు పొందింది. అయితే ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఒక్క అన్నా క్యాంటీన్లు, ఇతరత్రా అవసరాలకు మినహా, మిగిలిన సంక్షేమ అంశాల ప్రస్తావనే లేదు. కూటమి ప్రకటించిన సూపర్-6లోని అత్యవసర పథకాలకూ నిధులు కేటాయించలేదు.

నెలవారీ సంక్షేమం కోసం లబ్ధిదారుల ఎదురు చూపు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు మేనిఫెస్టోలో భారీ హామీలిచ్చి, ఆ దిశగా ప్రజల మన్ననలు పొంది అధికారంలోకి వచ్చాయి. అనంతరం మేనిఫెస్టోలోని అంశాలపై కార్యాచరణ మొక్కుబడిగా కొనసాగుతోంది. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కనీసం మూడు లేదా ఆరు నెలలపాటు సమయం అవసరమే. అయితే నెలవారీగా అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలను వాయిదా వేసుకుంటూ పోతే..అవి ప్రభుత్వానికి మరింత భారం కానున్నాయి. సూపర్ 6లో భాగంగా యువతకు 20లక్షల ఉద్యోగాలు/నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి హామీకి యువత ఆకర్షితులయ్యారు. ఈరెండు నెలల్లో ఎవ్వరికీ ఉద్యోగాలు ఇవ్వనందున అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.3వేల చొప్పున రెండు నెలలకుగాను రూ.6వేలు పెండింగ్ అవుతుందని నిరుద్యోగులు చెబుతున్నారు. 19 ఏళ్ల నుంచి 59సంవత్సరాల వరకు ప్రతి మహిళకూ నెలకు రూ.1500 సొమ్ము ఇస్తామన్నారు. ఆ లెక్కన రెండు నెలలకుగాను ప్రతి ఒక్కరికీ రూ.3వేలు సొమ్ము ప్రభుత్వం బకాయి పడిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు మినహా...ఇంకా లక్షా 50వేల మంది విధుల్లో ఉన్నారు. వారికి కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత గతంలో మాదిరిగా రూ.5వేలు మాత్రమే వేతనం వేస్తున్నారు. వలంటీర్ల గౌరవ వేతనం రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామన్న హామీ అమలు చేయాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకూ పెన్షన్ల హామీలు

బీసీ డిక్లరేషన్‌లో భాగంగా 50 సంవత్సరాలకే నెలకు రూ.4వేల పెన్షన్ ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచారు. ఈ లెక్కన ఈ రెండు నెలల్లో అర్హులైన లబ్ధిదారులకు రూ.8వేలు బకాయి ఉంది. ఎస్సీ,ఎస్టీలకు 50ఏళ్లకే పెన్షన్ విధానం అమలు అని వాగ్దానం చేశారు. ముస్లిం మైనార్టీలకూ 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని మేనిఫెస్టోలో స్పష్టంచేశారు. ఆ మేరకు ఎస్సీ,ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు రెండు నెలల పెన్షన్ బకాయిలు రావాల్సి ఉంది. ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలు సూపర్6లో ఉండగా... అవి ఇంకా పట్టాలెక్కలేదు. ఏడాదికి ఇచ్చే పథకాల హామీని చూస్తే...పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి(ఇంట్లో పిల్లలు ఎందరున్నా...అందరూ పాఠశాలకు వెళ్తే) ఏడాదికి రూ.15వేలు ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ ఇంతవరకు దాని ప్రస్తావనే లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపైనా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం ఇవ్వలేదు.

పంటలు ప్రారంభమైనప్పటికీ, రైతుకు ఇది దరిచేరలేదు. ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఇలాంటి కీలక హామీల ప్రస్తావన లేదు.పూర్తి స్థాయి బడ్జెట్ ఆధారంగానే వాటి అమలుపై ఒక స్పష్టత వస్తుది. దీంతో కూటమి ఎప్పుడెప్పుడు తమకు ఇచ్చిన సంక్షేమ వాగ్దానాలు అమలు చేస్తుందాని లబ్ధిదారులు వేచిస్తున్నారు.

నాపై ఈడీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కాగా రాజకీయ వేధింపుల కోసం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని మోదీ సర్కారు దుర్వినియోగం చేయడంపై వాయిదా తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ శుక్రవారం నోటీసు సమర్పించారు. కేంద్ర బడ్జెట్ 2024-25పై లోక్‌సభలో చర్చ సందర్భంగా సోమవారం ప్రసంగించిన రాహుల్ గాంధీ ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని చక్రవ్యూహం (పద్మ వ్యూహం) లోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతంలోని కురుక్షేత్ర సంగ్రామంలో కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా, మరికొందరిపై రాహుల్ గాంధీ విమర్శలు సంధించారు. అభిమన్యుడిని పద్మవ్యూహంతో ఆరుగురు ఎలా హత్య చేశారో, ఇప్పుడు దేశాన్నీ అదే చేయబోతున్నారని వ్యాఖ్యానించారు. యువత, రైతులు, మహిళలు, చిన్న, మధ్య తరహా వ్యాపారుల చుట్టూ, దేశంలోని ఆరుగురు వ్యక్తులు చక్రవ్యూహాన్ని పన్నుతున్నారని రాహుల్ ఆరోపించారు. రాజకీయ, వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే కేంద్ర బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశాన్ని బంధించిన చక్రవ్యూహం వెనుక మూడు శక్తులు ఉన్నాయన్నారు. దేశ సంపద మొత్తాన్ని కబళించాలని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు మొదటి శక్తి కాగా, దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ రెండోదని అన్నారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గాన్ని మూడో శక్తిగా రాహుల్ అభివర్ణించారు. ఇవి దేశాన్ని విధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఇండియా ఐక్య సంఘటన పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధమైన హామీతో పాటు కుల గణనను సభ ఆమోదించేలా చూస్తుందని చెప్పారు.

వ్యవస్థీకృత ఉల్లంఘన లేదు

(మొదటిపేజీ తరువాయి)

కూడా మళ్లీ భవిష్యత్తులో ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తన ఆదేశాల్లో పేర్కొంది. 'ప్రశ్న పత్రాల లీకేజీ కేవలం పాట్నా, హజారిబాగ్‌లో మాత్రమే జరిగిందని, వ్యవస్థీకృత ఉల్లంఘన లేనందున మేము నీట్-యూజీ పరీక్షను రద్దు చేయలేదు' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఎన్‌టీఏ పనితీరును సమీక్షించడానికి, పరీక్షా సంస్కరణలను సిఫార్సు చేయడానికి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కేంద్రం నియమించిన ప్యానెల్‌ను విస్తరించింది. ప్యానెల్‌ను విస్తరించినందున, పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి వివిధ చర్యలపై కమిటీ తన నివేదికను సెప్టెంబరు 30 లోపు సమర్పించనుందని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. పరీక్షా విధానాన్ని పటిష్టం చేసేందుకు సాంకేతిక పురోగతులను స్వీకరించేందుకు ప్రామాణిక నిర్వహణా విధానాన్ని రూపొందించడాన్ని రాధాకృష్ణన్ ప్యానెల్ పరిశీలించాలని ధర్మాసనం కోరింది. నీట్-యూజీ పరీక్ష సమయంలో తలెత్తిన సమస్యలను కేంద్రం సరిదిద్దాలని కోరింది. జులై 23న ఉన్నత న్యాయస్థానం పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని కోరుతూ దాఖలయిన పిటిషన్లను తోసిపుచ్చింది. వ్యవస్థీకృత ఉల్లంఘన జరిగిందని నిర్ధారించడానికి రికార్డులో ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంది. ఈ ఉత్తర్వును ప్రకటిస్తూ, దాని వివరణాత్మక కారణాలను అనుసరిస్తామని తెలిపింది. ప్రశ్న పత్రం లీక్, మోసం, వంచన వంటి పెద్ద ఎత్తున అవకతవకలపై వీధుల్లో, పార్లమెంటులో తీవ్ర విమర్శలు, నిరసనలను ఎన్‌డీఏ ప్రభుత్వం, ఎన్‌టీఏ ఎదుర్కొంది. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సులలో ప్రవేశాల కోసం 2024లో 23 లక్షల మంది విద్యార్థులకు మే 5న నీట్-యూజీ పరీక్ష జరిగింది. రికార్డులో ఉన్న వివరాల ప్రకారం, 'పరీక్ష పవిత్రతకు భంగం కలిగించే ప్రశ్నపత్రం వ్యవస్థీకృత లీక్‌ను సూచించదు' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. పరీక్షను కొత్తగా నిర్వహించాలని ఆదేశించడం వల్ల ఇప్పటికే పరీక్షకు హాజరైన 24 లక్షల మందికి పైగా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొంది. 'ప్రవేశాల షెడ్యూల్‌కు అంతరాయం, వైద్య విద్యపై, భవిష్యత్‌లో అర్హత కలిగిన వైద్య నిపుణుల లభ్యతపై ప్రభావం చూపుతుంది. సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లు కల్పించబడిన అట్టడుగు వర్గాలకు తీవ్ర ప్రతికూలంగా మారుతుంది' అని కోర్టు తెలిపింది. రికార్డులో ఉన్న విషయం ఆధారంగా ఈ కోర్టు ప్రతిపాదించిన స్థిర సూత్రాలను వర్తింపజేయడంపై మొత్తం పరీక్షను రద్దు చేయమని ఆదేశించడం సమర్థనీయం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షను రద్దు చేయాలంటే తప్పు విస్తృతంగా, వ్యవస్థాత్మకంగా ఉండాలని పేర్కొంది. లీకేజీ స్వభావం వ్యవస్థాగతమైనదని, నిర్మాణపరమైన లోపాలతో పాటు మళ్లీ పరీక్షకు ఆదేశించే ఏకైక అవకాశంగా ఉందని పిటిషనర్ల తరపు న్యాయవాదుల అభ్యర్థనలను ధర్మాసనం తిరస్కరించింది.

వయనాడ్ సహా అవన్నీ సున్నిత ప్రాంతాలే...

న్యూఢిల్లీ : వయనాడ్‌లో విషాదం వేళ కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. ఆరు రాష్ట్రాల్లో ఆవరించి ఉన్న పశ్చిమ కనుమల్లో దాదాపు 56 వేల చ.కి.మీ పరిధిని పర్యావరణ సున్నిత ప్రాంతంగా ప్రకటిస్తూ ఐదో ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన 13 గ్రామాలు కూడా ఇందులో ఉన్నాయి. పర్యావరణ సున్నిత ప్రాంతాలకు సంబంధించి తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌పై ఏమైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే 60 రోజుల్లోగా తెలియజేయాలని కోరింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విషాద ఘటనలో దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పర్యావరణ సున్నిత ప్రాంతాలకు సంబంధించి జులై 31న కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. కేరళలో ఇటీవల ప్రభావానికి గురైన వయనాడ్‌లోని 13 గ్రామాలు సహా మొత్తం 9,993.7 చ.కి.మీ విస్తీర్ణాన్ని సున్నిత ప్రాంతంగా ప్రభుత్వం పేర్కొంది.

మహారాష్ట్రలో 17,340 చ.కి.మీ, కర్నాటకలో 20,668 చ.కి.మీ, తమిళనాడులో 6,914 చ.కి.మీ, గోవాలో 1,461 చ.కి.మీ, గుజరాత్‌లో 449 చ.కి.మీ ప్రాంతం దీని కిందకు వస్తుందని తెలిపింది. ఈ ముసాయిదా ప్రకారం ఆయా ప్రాంతాల్లో మైనింగ్, క్వారీ, ఇసుక తవ్వకాలు నిషేధం. ఇప్పటికే అక్కడ మైనింగ్ కార్యక్రమాలు చేపడుతుంటే మాత్రం... వచ్చే ఐదేళ్లలో దశల వారీగా వాటికి ముగింపు పలుకుతారు. కొత్తగా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు కూడా నిషేధం. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులను కొనసాగిస్తారు. అయితే, వాటి విస్తరణకు మాత్రం అనుమతి ఉండదు. కొత్తగా పెద్ద ఎత్తున ప్రాజెక్టులు, టౌన్‌షిప్‌ల నిర్మాణమూ నిషేధం.

సంపద సృష్టే ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యాన్ని కాపాడాలని చెప్పారు. మద్యం సేవించేవారితో మాన్పించడం సాధ్యం కాకపోయినప్పటికీ, తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యే నాణ్యత మద్యం లేకుండా చేస్తే కొంత వరకు మెరుగైన ఫలితాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా రేట్లు పెంచి పేదలను దోచుకుందన్నారు. నాటి మద్యం ధరలు భరించలేక చాలా మంది గంజాయి, కల్తీ మద్యం, నాటుసారా తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నారని చెప్పారు. ఇష్టారీతిన పెంచిన ధరలు పేదల జీవితాలను మరింత నాశనం చేశాయని, ఆ ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తమకు వచ్చిన ఆదాయాన్నంతా పేదలు మద్యానికే ఖర్చు చేసే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. దీనివల్ల వారి కుటుంబాల జీవన ప్రమాణాలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. ధరలు పెంచి పేదవాడిని దోచుకున్న విధానానికి స్వస్తి పలకాల్సిందేనని స్పష్టం చేశారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని సమగ్ర అధ్యయనం తర్వాత కొత్త మద్యం విధానం రూపొందించాలని ఆదేశించారు. దీని కోసం ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రైతులకు పగటిపూటే...

9 గంటల నాణ్యమైన విద్యుత్

- ఫీడర్ల సామర్థ్యం పెంపు
- సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యతివ్వాలి
- సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్ర రైతాంగానికి పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిం చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఆయా ఫీడర్ల సామర్థ్యాన్ని మెరుగు పరచడంతో పాటు ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వెలగపూడి సచివాలయంలో సీఎం శుక్రవారం విద్యుత్, మహిళా శిశు సంక్షేమ శాఖలపై వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. విద్యుత్ శాఖ సమీక్షలో భాగంగా రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉందని, ఆ దిశగా ప్రణాళికలతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. డిమాండుకు తగిన విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి వంటి పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు, అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, యూనిట్ విద్యుత్ తయారీకి అవుతున్న వ్యయం, లోటును భర్తీ చేసేందుకు ఇతర గ్రిడ్ల నుంచి కొనుగోలు చేస్తున్న విద్యుత్‌కు అవుతున్న వ్యయం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. థర్మల్, జల విద్యుత్, సౌర, పవన వంటి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు, త్వరలో అందుబాటులోకి రానున్న విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితుల పైనా సమీక్షించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విధానంపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎం కార్యదర్శి ఎ.వి.రాజ మౌళి, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్ కో జెఎండీ కీర్తి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె. నివాస్, కేపీఎంజీ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టండి :

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని, ఏడాదిలో ఫలితాలు సాధించే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశుమరణాలు, మిషన్ వాత్సల్య కింద చేపట్టే పిల్లల సంరక్షణ కార్యక్రమాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు అందించే పౌష్టికాహార పథకాలపై సమీక్ష చేశారు. 2014లో ప్రవేశపెట్టిన బాలామృతం, అమృత హస్తం, గోరుముద్ద, గిరి గోరుముద్ద, బాల సంజీవని వంటి పథకాల స్థితిగతులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అందులో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 48,770 ఉండగా, మినీ అంగన్‌వాడీలు 6,837 ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో గిరిజన ప్రాంతాల్లో 8,311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 2014 నుంచి 2019 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 12,496 కేంద్రాలను నిర్మించాలన్న లక్ష్యంతో పనులు మొదలుపెట్టగా 2019 నాటికి అందులో 6,119 నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 2,800 నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఐదేళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదన్నారు. గత ప్రభుత్వం కొత్తగా 2,048 అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేసి కేవలం 18 కేంద్రాలను మాత్రమే పూర్తి చేసిందని అధికారులు వివరించారు. అంగన్‌వాడీల ఉన్నతీకరణలోను పురోగతి లేదన్నారు. ఇప్పటికీ 14,597 కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు అని, 8,455 సెంటర్లలో విద్యుత్ సదుపాయం లేదని సీఎంకు అధికారులు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో మంచి ఫలితాలు సాధించేలా సరికొత్త ఆలోచనలతో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖలో సమగ్ర ప్రణాళిక, సమూల మార్పులు తీసుకురావాలన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధికారులు హాజరయ్యారు.

ఉమ్మడి విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ బరిలో బొత్స



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యన్నారాయణను ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు జగన్... ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన వారితో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో వైసీపీకి భారీ మెజార్టీ ఉన్న నేపథ్యంలో సహజంగా టీడీపీ పోటీకి పెట్టకూడదని, కాని చంద్రబాబు ఏరోజూ నైతిక విలువలు పాటించే వ్యక్తి కాదని జగన్ అన్నారు. రకరకాల ప్రలోభాలు, బెదిరింపులతో అడ్డగోలుగా గెలవడానికి ప్రయత్నిస్తారన్నారని, కుయుక్తులు, కుట్రలు అనేవి చంద్రబాబు నైజమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నిక జరగబోతోందన్నారు. అనంతరం ఒక్కొక్కరి నుంచి జగన్ అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత బొత్సను ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని నిర్దేశించారు.

సుప్రీం తీర్పుపై డీహెచ్‌పీఎస్ హర్షం

విశాలాంధ్ర-విజయవాడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వర్గీకరణ కోసం ఎస్సీలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డిమాండ్ అని పేర్కొన్నారు. ఎస్సీలోని ఉపకులాల అభివృద్ధికి ఈ తీర్పు దోహద పడుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీలోని ఉపకలాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రభుత్వ రంగంలో నానాటికి ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పులు కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

97 శాతం పెన్షన్ల పంపిణీ సంతృప్తికరం: సీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఒకటో తేదీనే ఇళ్ల వద్దకు వెళ్లి రూ.2,737 కోట్లతో 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులో రికార్డు స్థాయిలో 97.54 శాతం పింఛన్లు అందించామ న్నారు. ఎక్స్‌వేదికగా శుక్రవారం ఆయన ట్వీట్‌చేస్తూ, దానికి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన ఫొటోను జత చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఆర్థిక భద్రత తమ బాధ్యత అని, అది పేదల జీవితాలకు భరోసా కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు... ప్రభుత్వంలో భాగం అని, ప్రజలకు ఏ మంచి చేయాలన్నా వారే కీలకమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.5,300 కోట్లు విడుదల చేసి అలాంటి వర్గానికి కూడా ఒకటో తేదీనే జీతాలు అందజేశామని, పదవీ విరమణ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించామని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మా ణంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కలిసి కష్టపడ దామని, రాష్ట్ర భవిష్యత్తును మారుద్దామని సీఎం పిలుపునిచ్చారు.

నీటి హక్కులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

విశాలాంధ్ర - రాయచోటి: కృష్ణా నదీ జలాల పున:పంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి సీపీఐ కార్యాలయంలో సీపీఐ, రైతు సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కృష్ణా నదీ జలాల పున:పంపిణీకి సంబంధించి ఆగస్టు 2వ వారంలోపు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలతో కూడిన నివేదికను ఇవ్వాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కోరిందన్నారు. ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు గత ప్రభుత్వ హయాంలో ట్రిబ్యునల్ ఈ మేరకు ఆదేశించినా పట్టించుకోలేదని ఇప్పటికైనా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకునేలా ప్రభుత్వం వాదనలు వినిపించాలని కోరారు. కృష్ణా, గోదావరి నదుల నుండి తమకు కేటాయించిన, కేటాయించవలసిన నీటి వాటాలను సమగ్రంగా విశ్లేషించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు వివరించాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం రైతుసంఘాలు, సాగునీటిరంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. కాగా, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 5న ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేయతలపెట్టిన ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ నాయక్, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు బాబు మొండిచేయి

ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్లకూ చంద్రబాబు మొండి చేయి చూపారని, పీఆర్‌సీ ప్రస్తావన, మధ్యంతర భృతి లేదని ఏపీఎన్జీవో మాజీ అధ్య క్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు గత బకాయిలనూ చెల్లించడం లేదని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. 2.5 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేశారని, ఎన్నికలు ముందు వారికిచ్చిన హామీలన్నీ మరిచారన్నారు. రూ.10వేల గౌరవ వేతనం అన్నారని, అదీ లేదని, రెండు నెలల నుంచి రూ.ఐదు వేలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. అవుట్ సోర్సింగ్, అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు వారిని రాజకీయ కక్షలతో వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులకు మేలు చేస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు మాటలు ఆ హామీల అమలుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. కొత్తగా నియమితులైన ప్రభు త్వ ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు 1.20 లక్షల మంది పోలీసులు కలిపి దాదాపు మూడు లక్షలమంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) లో ఉండగా దాన్ని సమీక్షించి అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీమ్ తీసుకొస్తామని టీడీపీ కూటమి మేనిఫెస్టోలో పెట్టిందని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొ న్నారు. అదే ఇప్పుడు గ్యారెంటీడ్ పెన్షన్ పథకం (జీపీఎస్)పై గెజిట్ నోటిఫికే షన్ రాగానే ప్రభుత్వం మాట మార్చి, అది తమకు తెలియదని, రద్దు చేస్తామని, కారకులపై చర్య తీసుకుంటామని చెప్పడం దారుణమని అన్నారు.

'పింగళి'ని భరత జాతి మరువదు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మన దేశానికి జాతీయ పతాకాన్ని అందించి... నిత్య స్ఫూర్తిని రగిలించిన దివంగత పింగళి వెంకయ్యను భరత జాతి ఎన్నటికీ మరువదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పింగళి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆ మహనీయునికి మనస్ఫూర్తిగా అంజలి ఘటించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మన దేశానికి ఒక కేతనం ఉండాలనే తపనతో వెంకయ్య మువ్వన్నెలతో పతాకాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆ జెండా నాడు, నేడు, ఎన్నడూ మన కీర్తి కేతనంగా ఎగురుతూనే ఉంటుందని అన్నారు. ఆ జెండాకు సెల్యూట్ చేసిన ప్రతిసారి పింగళి స్ఫురణకు వస్తూనే ఉంటారని పేర్కొన్నారు.

ఆ మహనీయుని ఆశయ సాధనకు పాటుపడదాం: సవిత

భారత దేశ ఆత్మగౌరవానికి ప్రతీక స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. మహాత్మా గాంధీతో కలిసి ఎన్నో పోరాటాల్లో పాల్గొన్న యోధుడు పింగళి అని పేర్కొ న్నారు. నేను సైతమంటూ 19 ఏళ్ల నుంచే ఆయన దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారని తెలిపారు. భారతీయుల స్వేచ్ఛా వాయువుల కోసం కడ వరకూ పోరాడిన వెంకయ్య మచిలీపట్నం వాస్తవ్యులు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. ఆయన బాటలో నేటి యువత ముందుకు సాగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు అందరం పాటుపడాలన్నారు.

సీఐల బదిలీల్లో పైరవీలు!

ఏలూరు రేంజ్‌లో 41 మందికి స్థానచలనం

కోరుకున్న ప్రాంతం కోసం రాజకీయ నేతల వద్దకు

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఎట్టకేలకు సీఐల బదిలీలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదట విడతగా ఏలూరు రేంజ్ పరిధిలో గల కాకినాడ జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లా, కృష్ణా జిల్లాల్లో పని చేస్తున్న 41 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి.అశోక్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలందరూ వెంటనే ఆయా సర్కిళ్లలో విధుల్లో చేరాలని ఆదేశించారు. వాస్తవానికి ఈ బదిలీలు జులై 25 లోపే జరుగుతాయని జోరుగానే ప్రచారం సాగింది. అయితే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో డీఎస్పీ బదిలీలను సైతం ప్రభుత్వం నిలుపుదల చేయడంతో పోలీసు అధికారులు తమ పైరవీలకు పని పెట్టారు. ఆయా ప్రాంతాల్లో కోరుకున్న చోట బదిలీలు కోరుకునే సీఐలు రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అవ్వగా, మరికొందరు మాత్రం ఎక్కడ ఇచ్చినా పర్వాలేదంటూ మిన్నకుండి పోయారు. మరోవైపు ప్రభుత్వం డీఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి వరకు అధికారుల పని తీరును పరిగణనలోకి తీసుకుంది. ఇందుకు సంబంధించి అంతర్గత నివేదికలు రప్పించుకుంది. అదే సమయంలో ఆ ప్రాంతాల ఎమ్మెల్యేలకు సైతం ప్రాధాన్యత కల్పిస్తూ గత వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన అధికారుల స్థాయిని, పనితీరు బట్టి నియోజకవర్గం లేదా సబ్ డివిజన్ స్థాయిలో బదిలీలు చేయాలని సూత్రపాయంగా పోలీసు ఉన్నతాధికారులకు సంకేతాలు ఇచ్చిందనే ప్రచారం జోరుగానే సాగింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం జరిగిన బదిలీల సైతం అద్దం పడుతున్నాయని చెప్పవచ్చు. రెండు రోజుల క్రితం భారీ స్థాయిలో డీఎస్పీ బదిలీల జాబితాను ప్రభుత్వం విడుదల చేయగా, శుక్రవారం తాజాగా ఏలూరు రేంజ్ పరిధిలో గల ఆరు జిల్లాల్లో పని చేస్తున్న 41 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో రెండో దఫా బదిలీల జాబితా సైతం విడుదల చేసేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. రేంజ్ పరిధిలో గల కాకినాడ జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా, తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లా, కృష్ణా జిల్లాలలో పనిచేస్తున్న మొత్తం 17 మందిని వేకెన్సీ రిజర్వ్ (వీఆర్) కు తరలించగా మరో 24 మందికి పోస్టింగులు కల్పించారు. వేకెన్సీ రిజర్వ్‌కు తరలించిన సీఐలలో డి.సురేష్, వై.రవికుమార్, ఎస్వీవీఎస్ మూర్తి, ఎం.రామకుమార్, కేవీవీఎన్ సత్యనారాయణ, కె.సతీష్, కె.అప్పలస్వామి, అడబాల శీను, ఎ.ఎల్.ఎస్.రవికుమార్, కె.శ్రీనివాస్, వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్.పి.వీరయ్య గౌడ్, పెద్దిబోయిన శ్రీనివాసరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, మహమ్మద్ హబీబ్ బాషా, కె.ఏసుబాబు, ఎం.నాగ దుర్గారావు ఉన్నారు. అలాగే ఆర్.అంకబాబుకు సామర్లకోట యూపీఎస్‌కి, టి.క్రాంతి కుమార్‌కు పెద్దాపురం సర్కిల్, జి చెన్నకేశవరావుకు తుని రూరల్ సర్కిల్, ఎం.మోహన్ కుమార్‌కు ముమ్మిడివరం సర్కిల్, ఎన్.కొండయ్యకు తణుకు టౌన్ సర్కిల్, సిహెచ్.విద్యాసాగర్‌కు రావులపాలెం సర్కిల్, పి.విశ్వంకు కొవ్వూరు టౌన్ యూపీఎస్, వి.జగదీశ్వర్ రావుకు ఆకివీడు సర్కిల్, కె.రజిని కుమార్‌కు పాలకొల్లు టౌన్ యూపీఎస్, కె.మంగాదేవికి తూర్పుగోదావరి జిల్లా, జి.శ్రీనివాస్‌కు పాలకొల్లు రూరల్ సర్కిల్, బి.యాదగిరికి నరసాపురం టౌన్ యూపీఎస్, జి.కాళీ చరణ్‌కు భీమవరం టూ టౌన్, ఎం.నాగరాజుకు భీమవరం వన్ టౌన్, పి.కృష్ణకు కైకలూరు టౌన్ సర్కిళ్లకు బదిలీ చేశారు. అలాగే నామాల వెంకట నారాయణకు గన్నవరం ట్రాఫిక్-2 సర్కిల్, డీఎస్ చైతన్య కృష్ణకు కాకినాడ రూరల్ సర్కిల్, బొక్క పెద్దిరాజుకు సర్పవరం పిఎస్ సర్కిల్, జి.మధు బాబుకు రాజమహేంద్రవరం త్రీ టౌన్ సర్కిల్, కె.విజయ బాబుకు కొవ్వూరు రూరల్ సర్కిల్, జె.మురళీకృష్ణకు కంకిపాడు సర్కిల్, టీవీవీ రామారావుకు ఉయ్యూరు టౌన్ యూపీఎస్, ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావుకు గుడివాడ రూరల్ సర్కిల్, వి.పెద్దిరాజుకు గుడివాడ టూ టౌన్ పిఎస్ సర్కిళ్లకు బదిలీ చేస్తూ ఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ బదిలీల అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ బదిలీలు చేయడానికి సైతం జాబితా సిద్ధం చేశారు.

విశాఖ ఉక్కుపై మోదీ డబుల్ గేమ్: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు ఇవ్వకుండా చంపాలని చూస్తున్నారా అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. అమ్మ పెట్టదూ... అడుక్కు తిననివ్వదనే సామెతలా కేంద్రం తీరు ఉందంటూ ఎక్స్ వేదికగా శుక్రవారం ఆమె ట్వీట్ చేశారు. రూ.ఆరువేల కోట్ల అప్పుల్లో ఉన్నామని, ఉక్కు తయారీకి ముడిపదార్థాలు నిండుకున్నాయని, కొనేందుకు చిల్లిగవ్వ కూడా లేదని, ఈ నెల జీతాలు కూడా ఇవ్వడం కష్టమేనని యాజమాన్యం చేతులెత్తేసిందన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ మోదీకి కనీసం చీమ కుట్టినట్టైనా లేదా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీల మద్దతుతో మూడో సారి మోదీ గద్దె నెక్కారని, ఆంధ్రుల తలమానికం విశాఖ ఉక్కుపై డబుల్ గేమ్ ఆడుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌కు రూపాయి సహాయం చేయకుండా వెంటిలేటర్‌పైకి నెట్టేశారని విమర్శించారు. త్వరలోనే అదానీ, అంబానీ, జిందాల్ వంటి కార్పొరేట్ వాళ్లకు కట్టబెట్టే ముహూర్తం నిర్ణయించారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని, ముడి పదార్థాలను అందజేయా లన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పూర్వవైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

చందనా జయరాంకు సీఎం అభినందన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : మిస్ యూనివర్స్-ఇండియాకు రాష్ట్రం నుంచి అర్హత సాధించిన చందనా జయరాం అనే యువతిని సీఎం చంద్రబాబు అభినందించారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం ఎంకే పురానికి చెందిన చందనా జయరాం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో మిస్ యూనివర్స్ ఇండియాకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ముంబైలో జరిగే మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో ఏపీ నుంచి చందనా హాజరవుతారు. కుప్పం నుంచి చందనా జయరాం మిస్ యూనివర్స్-ఇండియా పోటీలకు అర్హత సాధించడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

పింగళి వెంకయ్యకు మంత్రి పార్థసారధి నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య ఉద్యమకాలంలో మన దేశానికి ఒక జెండా ఉండాలని భావించి జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య స్ఫూర్తిని భారతజాతి ఎప్పటికీ మరువదని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. పింగళి జయంతి సందర్భంగా ఆయన అంజలి ఘటించారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ప్రతిసారీ పింగళి వెంకయ్యను స్మరించుకుంటానని ఆయన పేర్కొన్నారు.

అవయవదానంపై అవగాహన అవశ్యం

ఏటా 5 లక్షల మంది మృత్యువాత: సత్యకుమార్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ అవయవదాన వారోత్సవాల్లో భాగంగా జీవన్‌దాన్ అధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. అవయవదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 260 మంది అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారని చెప్పారు. 90 వేల మంది దాతల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఏటా ఐదు లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కొల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం శనివారం అందించే అవార్డుకు మన రాష్ట్రం ఎంపికైందన్నారు. తాను అవయవదానానికి సమ్మతిని తెలియజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. ఆరోగ్యశ్రీ తీసేశారని విష ప్రచారం చేస్తున్నారని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చామని మంత్రి వివరించారు. రాష్ట్రానికి మంజూరైన 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ అవయవదానంపై అవగాహన కల్పించి దాతల సంఖ్య వందల నుంచి వేలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం పూర్తి పారదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను మంత్రి సత్కరించారు. తొలుత విజయవాడ ఏలూరు లాకుల నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు వలంటీర్లు, వైద్య కళాశాలల పారా మెడికల్, నర్సింగ్ స్టాఫ్ వాక్‌థాన్ నిర్వహించారు. జీవన్ దాన్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్. నరసింహం, గుంటూరు, విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌లు డాక్టర్ వై. కిరణ్ కుమార్, డాక్టర్ డి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బిందు సేద్యం నిర్వీర్యం

తక్షణమే రాయితీపై పరికరాలు: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందించాలని, అందుకు తక్షణమే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం బిందు సేద్యంపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో బిందు సేద్యం నిర్వీర్యం అయిందని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో రైతులపై కక్ష పూరిత ధోరణి అవలంభించిందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం రూ.1,167 కోట్లు బకాయిలు పెట్టిందని చెప్పారు. రైతులకు తక్షణమే బిందు సేద్యం అమలు చేయాలనే సంకల్పంతో కంపెనీలకు బకాయిలు చెల్లిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే రూ.176 కోట్లు విడుదల చేశామని తెలిపారు. వాయిదా పద్ధతిలో త్వరలోనే బకాయిలు కంపెనీలకు చెల్లిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా అందించే బిందు సేద్యం ఫండ్ (మైక్రో ఇరిగేషన్ ఫండ్) కూడా జగన్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని అన్నారు. ఈ ఏడాది మూడు లక్షల హెక్టార్లలో బిందు సేద్యం అమలు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. తద్వారా రైతాంగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.3,450 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. 2004లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో దేశ వ్యాప్తంగా బిందు సేద్యం అభివృద్ధి చేసేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో 2015-2018 మధ్య దేశంలోనే బిందు సేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ 17.6 శాతం భాగస్వామ్యంతో ప్రథమ స్థానంలో ఉండగా, జగన్మోహన్ రెడ్డి హయాంలో 2019-2023 మధ్య 5.7 శాతం భాగస్వామ్యానికి తీసుకుని వచ్చి బిందు సేద్యాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఉద్యాన సాగులో 55 శాతం మాత్రమే బిందు సేద్యం అమలౌతోందని, నూరు శాతం అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బిందు సేద్యం తక్షణమే అమలుకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఉద్యాన, మత్స్య శాఖల కార్యదర్శి అహ్మద్ బాబు, ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఏపీఎంఐడీపీ ప్రాజెక్టు అధికారి బి.హరనాథరెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

సామాజిక న్యాయ దృష్టిని మార్చే తీర్పు

షెడ్యూల్డు కులాలలో (ఎస్.సి.), షెడ్యూల్డ్ తరగతులలో(ఎస్.టి.) ఉన్న ఉపకులాల ఆధారంగా వర్గీకరణ జరగాలని మూడు దశాబ్దాల నుంచి సాగుతున్న ఉద్యమాన్ని సుప్రీంకోర్టు తీర్పు ఒక కొలిక్కి తీసుకొచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ సహా ఏడుగురు న్యాయమూర్తులలో ఆరుగురు న్యాయమూర్తులు ఉపవర్గీకరణకు అంగీకరించారు. న్యాయమూర్తి బేలా త్రివేదీ మాత్రమే ఉప వర్గీకరణను అంగీకరించలేదు. ప్రధాన న్యాయమూర్తితో పాటు న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, విక్రం నాథ్, పంకజ్ మిత్తల్, మనోజ్‌మిశ్రా, సతీశ్‌చంద్రశర్మ ఉపవర్గీకరణకు సమ్మతిస్తూ తీర్పు వెలువరించారు. ఎస్.సి.లుగా గుర్తించేవర్గంలో తెలుగు రాష్ట్రాలలోనే కాదు... దేశమంతటా అనేక ఉపకులాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలలో ఎస్.సి.లు అన్న మాటను మాలలు, మాదిగలు అని విశాలమైన అర్థంలో వాడు తుంటారు. కానీ మాదిగలలో అనేక ఉప కులాలు ఉన్నాయి. సామాజికంగా మాలలు ఎస్.సి.లలో భాగమే అయినప్పటికీ వారి వృత్తుల కారణంగా, క్రైస్తవ మత ప్రభావం వల్ల వారి పరిస్థితి కాస్త మెరుగుపడింది. ఆ వర్గంలో చైతన్యస్థాయి పెరిగింది. అందుకని విద్య, ప్రభుత్వోద్యోగాలలో వారు మెరుగైన స్థితిలో ఉన్నారు. కానీ స్థూలంగా మాదిగలు అనుకునే కులాల వారిలో రిజర్వేషన్ల ఫలితాలను మాలలే ఎక్కువగా అనుభవిస్తున్నారు కనక ఎస్.సి.లలో ఉపవర్గీకరణ జరగాలని చాలాకాలం నుంచి పట్టుబడుతున్నారు. తెలుగునేలలో అయితే మంద కృష్ణ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సుదీర్ఘ కాలంగా ఉద్యమం నిర్వహించింది. సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఇంతవరకు తమకు దక్కాల్సిన ప్రయోజనాలను మాలలే అనుభవించారని బాధపడ్డ కులాల వారికి కొంత ఉపశమనం కలగవచ్చు. అయితే రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఈ తీర్పుకు ఏ మేరకు కట్టుబడి ఉంటాయన్నది ముందు ముందు కానీ తేలదు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని విచారించినప్పుడు ప్రధానంగా రెండు అంశాల మీద దృష్టి కేంద్రీకరించింది. ఎస్.సి.లనే ఒక వర్గంగా పరిగణించినందువల్ల అందులో మళ్లీ ఉపవర్గీకరణ చేయొచ్చునా లేదా అన్న అంశాన్ని పరిశీలించారు. అంతిమ తీర్పు ప్రకారం ఉప వర్గీకరణం చేయొచ్చుననే నిర్ణయానికి వచ్చారు. రెండో అంశం రాజ్యాంగంలోని 341వ అధికరణం ఎస్.సి.లకు రిజర్వేషన్లు కల్పించాలని చెప్పింది కానీ ఎస్.సి.లుగా పరిగణించే వారందరూ ఒకే కులానికి చెందినవారు కారు కదా అని చర్చించారు.

ఎస్.సి.లలో తెలుగు రాష్ట్రాల దృష్టికి పరిమితం అయి చూసినా ఎస్.సి.లలో రెండు కులాలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉంటారు. కానీ ఎస్.సి.లలో అనేక ఉపకులాలు ఉన్నాయి. ఉత్తరాదిన అయితే ఎస్.సి.లను చర్మకార వృత్తిలో ఉన్నవారు, ఇతర వృత్తులు అనుసరించే వారు అన్న ప్రధాన విభజన కనిపిస్తుంది. ఒక్క చర్మకార వృత్తిలో ఉన్నారా లేదా అన్న అంశమే కాకుండా మాదిగలలో అనేక ఉపకులాలు ఉన్నాయి. వారి దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ల ప్రయోజనం కలగాలన్న వాదనను నిరాకరించలేం. కాస్త పరిస్థితి మెరుగ్గా ఉన్న వర్గాలు రిజర్వేషన్ల ప్రయోజనాలను ఎక్కువగా అనుభవించారు కనక తమకు నష్టం కలిగిందని, ఆ నష్టాన్ని పూడ్చుడానికి ఎస్.సి.ల కిందకు వచ్చే ఉపకులాలను ఉపవర్గాలుగా తేల్చి చూడాలని ఉద్యమాలు జరిగాయి. అత్యున్నత న్యాయస్థానం గురువారం ఇచ్చిన తీర్పువల్ల ఉపవర్గీకరణ సాధ్యం అవుతుంది కనక ప్రధాన ఫిర్యాదు సమసి పోవచ్చు. కానీ దీనివల్ల తమకు దక్కాల్సిన వాటా దక్కకుండా పోతుందని మాలలు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశమూ లేక పోలేదు. అప్పుడే ఇలాంటి స్వరాలు వినిపిస్తున్నాయి.

ఎస్.సి.లకు వర్తించే రిజర్వేషన్లను ఉప వర్గీకరణ ఆధారంగా అమలు చేయడంతో భారత రాజకీయాలలో పెద్ద పరిణామాలే రావొచ్చు. ఎందుకంటే ఈ ఉపవర్గీకరణ ఒక్క ఎస్.సి.లతో ఆగదు. అది కచ్చితంగా షెడ్యూల్డ్ జాతుల (ఎస్.టి.)కు, ఇతర వెనుకబడిన (ఒ.బి.సి.) వర్గాల వారికి, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారి విషయంలోనూ ఇదే విధానం అనుసరించాలని అడగొచ్చు. ఇతర వెనుకబడిన తరగతుల వారి వర్గీకరణ తెలుగు మాట్లాడే రాష్ట్రాలలో అర్థ శతాబ్దం పై నుంచే అమలులో ఉంది. బీహార్‌లో కర్పూరీ ఠాకూర్ హయాంలో ఈ వర్గీకరణ జరిగింది. ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల వెనుకబడిన తరగతుల వారి మధ్య ఉపవర్గీకరణ ఇప్పటికీ లేదు. తమిళనాడు, బీహార్‌లో అత్యంత వెనుకబడిన వర్గాల వారిని కూడా రిజర్వేషన్ల అమలుకు పరిగణనలోకి తీసుకుంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఉపవర్గీకరణ వివిధ రాష్ట్రాలలో ఉన్న పరిస్థితిని బట్టి ఆ రాష్ట్రాలే చేయవలసి ఉంటుంది. రిజర్వేషన్లు వర్తించే ఎస్.సి., ఎస్.టి., ఒ.బి.సి.లలో కొన్ని వర్గాల వారు చాలా వెనుకబడి ఉన్నారు. సామాజికంగానూ తేడాలున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఎస్.సి., ఎస్.టి. వర్గాలకు రిజర్వేషన్లు అమలు అయినందువల్ల రిజర్వేషన్ల కొలమానం ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా పరిస్థితి మెరుగుపడిన వారూ ఉండొచ్చు. అయితే ఫలానా సామాజిక వర్గం వారికి సంపూర్ణంగా మేలు కలిగిందని చెప్పలేం. ఒ.బి.సి.లకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన స్థితి వచ్చినట్టు సుప్రీంకోర్టు ఆర్థిక ప్రమాణాన్ని కూడా చొప్పించింది. దీన్నే క్రీమీలేయర్ అంటున్నాం. అంటే ఆర్థిక స్తోమత సంపాదించిన వారికి రిజర్వేషన్లు వర్తింప చేయనవసరం లేదని సుప్రీంకోర్టు సూత్రీకరించింది. ఇప్పుడు ఎస్.సి.ల ఉపవర్గీకరణను ఆమోదించిన సమయంలోనూ సుప్రీంకోర్టు కాస్త కలిగిన వారిని రిజర్వేషన్ల నుంచి మినహాయించాలంటోంది. అంతేగాక ఒక తరానికే ఈ వర్గీకరణ వర్తింప చేయాలనీ సూత్రీకరించింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వారికి ఇంతవరకు రిజర్వేషన్ సదుపాయం కల్పించాం కనక ఈ అంశాల్లో వారి పరిస్థితి మెరుగైన తరవాత రిజర్వేషన్లు ఎందుకు అన్న వాదన తర్కబద్ధంగానే కనిపిస్తుంది. కానీ కులగణన, ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన గణాంకాలు సిద్ధంగా లేవు కనక ఇది ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. రిజర్వేషన్ సదుపాయం వల్ల విద్యాపరంగా ఎదగొచ్చు. ప్రభుత్వోద్యోగం సంపాదించొచ్చు. కానీ ప్రభుత్వోద్యోగం రాని వారికి, చిల్లరమల్లర పనులుచేసి బతుకీడ్చే వారి తరవాత తరానికి రిజర్వేషన్లు అక్కర్లేదు అంటే ఆచరణయోగంగా ఉండదేమో!. ప్రభుత్వోద్యోగాలలో తగిన ప్రాధాన్యంలేని కులాలకు అవకాశం కల్పించడానికి ఈ తీర్పు వెసులుబాటు కల్గించవచ్చు. కానీ ప్రభుత్వోద్యాగాలే తగ్గిపోతున్నప్పుడు ఉపవర్గీకరణ కూడా పెద్దగా ఉపకరించకపోవచ్చు. అంటే సిద్ధాంతరీత్యా సుప్రీంకోర్టు తీర్పు చాలా ప్రయోజనకరంగా కనిపించినా ఆచరణలో ప్రయోజనం పరిమితం కావొచ్చు. ఉపవర్గీకరణ ఇంతవరకు లేనందువల్ల ఎస్.సి.లలో చైతన్యవంతమైన వర్గం ఇన్నాళ్లూ పొందిన ప్రయోజనాన్ని ఏ మేరకు వదులుకుంటుంది అన్న అంశం కూడా రాజకీయాలు వేడెక్కడానికి ఇంధనంగా తయారు కావచ్చు. ఈ తీర్పు సామాజిక న్యాయ రాజకీయాలను కూడా ప్రభావితం చేయవచ్చు. 1980ల నుంచి కుల రాజకీయాలకు ప్రాధాన్యం పెరిగింది. ఆ సమీకరణలను మార్చుకోవలసిన అవసరమూ ఉండొచ్చు. ఈ తీర్పు కులగణన కోసం పాటుపడేవారికి అదనపు ఆయుధం అందిస్తుంది.

ఎగిసిన అస్తిత్వ ప్రతీక...!!!

యస్... నేను మరణిస్తాను... నా వారసత్వం ఎక్కడి నుంచో వస్తుంది. కొన్నాళ్ళకు అది కూడా అమరత్వం పొందుతుంది. మళ్లీ మళ్లీ మా పోరాటాలకు, ఉద్యమాలకు మా వారసత్వం వస్తుంది. బహుశా ఇదీ అమరత్వం పొందవచ్చు. కొత్త రూపంలో కొత్తతరం మళ్ళీ ఈ ఉద్యమాలలోకి వస్తుంది.

ఈ కొత్త తరం ఆనాటి మా కలలనే కాదు ఈనాటి తమ భూమిని, ప్రజలను కూడా కాపాడుకుంటుంది. తప్పక విజయం సాధిస్తుంది" ఇలా అన్నది తూర్పు లిబియా పోరాట ఉద్యమ నాయకులు ఉమర్ ముక్తార్. లిబియాపై ఇటలీ చేస్తున్న వలసవాద దాష్టీకాలకు వ్యతిరేకంగా తూర్పు లిబియా నుంచి ఉద్యమం నడిపిన వాడు. 73 ఏళ్ల వయసులో ఎడారిలో సింహంలా ఉద్యమాన్ని ఉరకలు, పరుగులు పెట్టించిన నాయకుడు. ఈ చరిత్రని ఉమర్ ముక్తార్ పేరుతో సినిమాగా తీశారు. 1931లో ఇటలీ సైన్యం ఆ మహావీరుడ్ని అరెస్టు చేసింది. తమకు అనుకూలంగా మారమని, తాము ఇచ్చే కానుకలు పొందమని ఇటలీ జనరల్ ఒత్తిడి చేశాడు.

ఇటాలియన్ కాన్సంట్రేషన్ క్యాంపులో తన వారందరి ముందు ఉమర్ ముక్తార్‌ను బహిరంగంగా ఉరితీశారు. ఆ ఉరి అనంతరం నేలమీద పడిపోయిన ఉమర్ ముక్తార్ చేతిలోని కళ్ళజోడుని ఓ ఆరేళ్ల పిల్లాడు తీసి కళ్ళకు అమర్చు కుంటాడు. ఆ కుర్రాడి తల్లి తీవ్ర దుఃఖంతో ఆ కుర్రాడ్ని ఎత్తుకుని అలా నడుచుకుంటూ వెళ్ళిపోతుంది. ప్రపంచంలో ఏ ఉద్యమమైనా ప్రారంభమూ, దాని కొనసాగింపు, దాని వారసత్వం కూడా ఇలాగే

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

ఉంటుంది. ఇది జరగడానికి ఎంతకాలం పడుతుందో ఎవరూ చెప్పలేరు. అలాంటి ఉద్యమాలు, పోరాటాలు నీతి నిజాయితీతో కూడుకున్నవైతే ఆ ప్రజల నుంచే కాదు సంఘీభావం తెలిపే సమాజాల నుంచి కూడా ఆదరణ లభిస్తుంది.

ఏ దేశ స్వాతంత్రమైన, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలైనా, ఏ జాతైనా తమకు అన్యాయం జరుగుతోందంటూ త్యాగాలకు వెరవకుండా ఉద్యమాలుచేస్తే ఎప్పుడూ మంచి ఫలితాలే వస్తాయి. దీనికి అనేక ఉద్యమ ఉదాహరణలు ఉన్నాయి. అలాగే కొన్ని దశాబ్దాల తరబడి అడ్డంకులు ఉంటాయి. అవి రాజకీయంగా, స్థానికంగా, వర్గాలుగా, ముఠాలుగా మోకాలు అడ్డుపెడుతున్నవి కావచ్చు. వీటిని దాటడానికి న్యాయస్థానాల గడపలు దాటాల్సి రావచ్చు. దీనికి ఎంతకాలం పడుతుందో సరిగ్గా చెప్పలేం. అసలు ఆ మాటకొస్తే ఆ ఉద్యమాలను తలకెత్తుకున్నవారు ఆ ఉద్యమ విజయాలను తనివితీరా చూసి ఉండలేకపోవచ్చు. ప్రత్యేక తెలంగాణ రావాలని ఎన్నో కలలు కన్నారు కాళోజీ. అలాగే ఆయన తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ సార్. ఈ ఇద్దరు మహానుభావులు తెలంగాణ కల తీరకుండానే తనువు చాలించారు. వారిద్దరి వారసుడిగా తెలంగాణ కాగడాన్ని తన భుజానికి ఎత్తుకున్న కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తన కళ్ళారా చూసుకుంటున్నారు.

ఇక్కడ రాజకీయాలు పదవుల గురించి కాదు నేను మాట్లాడేది కేవలం తెలంగాణ గురించి మాత్రమే. ఇదంతా చరిత్ర. వర్తమానానికి వస్తే మాదిగ దండోరా మూడున్నర దశాబ్దలక్రితం చేపట్టిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్పీఎస్) పోరాటానికి భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నుంచి ఓ గొప్ప విజయం కానుకగా లభించింది. రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సంవత్సరాల తరబడి తాత్సారం జరిగింది. ఈ వర్గీకరణ సహేతుకం కాదంటూ దళితవర్గాల నుంచే ఉద్యమము నడిచింది. చివరికి వర్గీ కరణవైపే సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం ఎమ్మార్పీఎస్ ఇన్నేళ్ల ఉద్యమా నికి కలిగిన గొప్ప ఊరట. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్షణంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు వర్గీకరణ అమలు చేసేందుకు అడుగులు వేస్తున్నాయి. వీటిని అడ్డుకునేందుకు వైరిపక్షాలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తారు కదా

" ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా....ఇకపై సాగదు

అని మహాకవి శ్రీశ్రీ ఆగ్రహ, ఆవేశ ప్రకటనే కాదు జాన్తానై అని గద్దించాడు. ప్రపంచవ్యాప్తంగా జాతుల మధ్య వైరం పెరగడం నేటి ప్రపంచ ప్రజల దురదృష్టం. దానిని మించి మన ముందే ఒకే జాతిలో వైరుధ్యం పెరగడం అత్యంత విషాదం. ఈ రెంటి మధ్య ఉన్న వైషమ్యాలను తొలగించేందుకు సామరస్యపూర్వక వాతావరణాన్ని నింపేందుకు ఏ రాజకీయ పార్టీ ముందుకు రాకపోవడం మరింత విషాదం.

ఇక మూడున్నర దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం నిజంగా ఓ అద్భుతం. ఓ ప్రాంతంలో తాను మైనారిటీ. మరో ప్రాంతంలో మెజార్టీ. ఈ సమయంలోనే తాను నేర్చుకున్న రహస్య రాజకీయాలతో నెగ్గుకొచ్చారు. ఎక్కడ ఎన్ని లాబీయింగ్‌లు చేశాడో. తన మూడున్నర దశాబ్దాల పోరాటానికి సుప్రీంకోర్టు నుంచి గౌరవప్రదమైన విజయాన్ని పొందగలిగాడు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం తీవ్రదశలో ఉండగా రంగారెడ్డి జిల్లా తాండూరులో ఆ ఉద్యమ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించాడు మందకృష్ణ మాదిగ. అప్పటికే నాకు మంచి స్నేహితుడు కావడం,

జర్నలిస్టు వృత్తిలో భాగంగా కొన్నాళ్లు ఇతర రాజకీయ వార్తలు, రాజకీయేతర బీట్లకు విరామంఇచ్చి ఎమ్మార్పీఎస్ బీటు వార్తలే రాస్తున్నాను. అదిగో ఆ సమయంలో, తాండూరులో సమావేశం ముగిసాక, రాత్రి 8 గంటలకి నాకు ఫోన్ చేశాడు కృష్ణ మాదిగ. "చక్రి ఎక్కడున్నావ్. మా కార్యకర్తకి కారు ఇచ్చి పంపుతున్నాను. తాండూర్ రాగలవా. కొద్దిగా మాట్లాడాలి" అన్నాడు మిత్రుడు మందకృష్ణ. ఆనాటి పత్రిక ఎడిటర్ అనుమతి తీసుకుని కారులో తాండూర్ వెళ్లాను. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున మూడు గంటల వరకు మా ఇద్దరికీ మధ్య అనేక అనేకానేక వాదాలు, విమర్శలు, మాటలు. ఓ పెద్ద ఇంటర్వ్యూ. మధ్యలో ఆఫ్ ది రికార్డ్ కబుర్లు. నేను బయలుదేరే ముందు " అన్నా... ఈ వర్గీకరణ ఉద్యమం విజయం కావడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతుంది" అని అడిగా. అప్పుడు.... ఆ సమయాన... అచ్చంగా... ఆ తెల్లవారుజామున....నేను ముందుగా రాసిన లిబియా ఉద్యమ నాయకుడు ఉమర్ ముక్తార్ అన్న మాటలే అన్నాడు. ఇంచుమించు అలాంటి మాటలే అన్నాడు. విజయం మనం చూడలేకపోయినా మన వారసులు ఉంటారుగా అన్నాడు.

ఆ ఉమర్ ముక్తారో...
మహానుభావుడు కాళోజీయో..

తెలంగాణను కలగన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ లానో ... కాకుండా...తన మూడు దశాబ్దాల పోరాట విజయాన్ని తానే అందుకున్నాడు. తన వారసులకు వర్గీకరణ విజయాన్ని కానుకగా ఇస్తున్నాడు. అతడే... నా మిత్రుడు మందకృష్ణ మాదిగ.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

నదీజలాల హక్కుల రక్షణ అవశ్యం

కె.వి.వి. ప్రసాద్

రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు సమగ్రంగా వాదనలు వినిపించి కృష్ణానదీ జలాల పున: పంపిణీలో రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఆగస్టు 2వ వారంలోపు రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలతో కూడిన నివేదికను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఇవ్వాలని ట్రిబ్యునల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నీటి పునః పంపిణీ, ప్రాజెక్టుల నిర్వాహణకు విధి విధానాలను రూపొందించి తమ నివేదిక ద్వారా సూచనలు చేయాలి. ముందుగా ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖామంత్రి తక్షణం రాష్ట్రంలోని రాజకీయ పార్టీల, రైతుసంఘాల, నీటిపారుదల రంగ నిపుణులతో విస్తృత సమావేశం నిర్వహించి రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వము జలశక్తి విభాగం 2023 సెప్టెంబరు 6 న భారత ప్రభుత్వం ద్వారా ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కృష్ణానదీ జలాల వివాద పరిష్కారాల ట్రిబ్యునల్-1 (బచావత్ ట్రిబ్యునల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణానది నుంచి కేటాయించిన 811 టి.యం.సిల నీటిని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అదనంగా కేటాయించిన నీటిని పరిగణనలోనికి తీసుకుని ఉభయ రాష్ట్రాల మధ్య పున: పంపిణీ చేయాలని కేంద్రం సూచించింది. గోదావరినది జలాల వివాద పరిష్కారాల ట్రిబ్యునల్ ఉత్తర్వులననుసరించి, గోదావరినది నుండి కృష్ణానదికి తరలించే నీటి సముదాయాన్ని లెక్కించి పై రాష్ట్రాలకు ఇచ్చే వాటాలను సమీక్షించాలి.

ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదుల నుంచి తమకు కేటాయించిన / కేటాయించవలసిన నీటిని సమగ్రంగా విశ్లేషించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలను వినిపించాలి. కృష్ణా-గోదావరి నదులపై ఆంధ్రప్రదేశ్ చివరి రాష్ట్రమైనందున కృష్ణానది నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లభించిన నీటి కేటాయింపు ప్రకారం కృష్ణానదిలో 75 శాతం విశ్వసనీయతతో, సాలీనా 2060 టి.యం.సిల నీరు నదీప్రవాహం ద్వారానూ, 70 టి.యం.సిల నీరు రీ జనరేటెడ్ విధానం ద్వారా లభిస్తుందని నిర్ధారించారు. సదరు నీటిలో మహారాష్ట్రకు 585 టి.యం.సిలు, కర్నాటకకు 734 టి.యం.సిలు చివరిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టి.యం.సిల నీటిని వినియోగించుకునే విధంగా పంపిణీ చేశారు. జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్, వివిధ రాష్ట్రాల మధ్య కృష్ణానదీ జలాలను పంపిణీ చేసే విషయంలో ఈ క్రింది అంశాలను ప్రప్రథమంగా పరిగణనలోనికి తీసుకున్నది. అంతర్జాతీయంగా అమలులో ఉన్న ప్రథమ వినియోగదారునికి ప్రథమ హక్కు అనే సూత్రాన్ని, మనదేశంలో ఆనాడు అమలులో ఉన్న ఆనవాయితీలను అనుసరించి నీటిని కేటాయించారు. 1969 సెప్టెంబర్ 30కు ముందు వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న కేంద్ర జలసంఘం వారి ఆమోదంతో నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యతను కల్పించి నీటిని కేటాయించారు. కర్నాటక రాష్ట్రం లేవనెత్తిన పరీవాహక ప్రాంతాల నిష్పత్తిలో నీటిని కేటాయించాలని కోరగా ట్రిబ్యునల్ నిర్ద్వందంగా తిరస్కరించింది. రాష్ట్రానికి కేటాయించిన 811 టి.యం.సి.ల నీటిని కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లోని వివిధ ప్రాజెక్టులకు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014ననుసరించి కృష్ణానదిలో లభించే 811 టియంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్ 512 టియంసిలు, తెలంగాణా 299 టియంసిలు వినియోగించుకుంటున్నాయి.

జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన కృష్ణా నదీ జలాల వివాదపరిష్కారాల ట్రిబ్యునల్-2, ఏప్రిల్ 2004లో కేంద్రప్రభుత్వం నియమించింది. జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ గతంలో 75శాతం విశ్వసనీయతతో వివిధ రాష్ట్రాలకు కేటాయించిన కేటాయింపులను ఏ విధమైన మార్పులు చేయకుండా యధాతదంగా వినియోగించుకునే ఆవకాశం కల్పించింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నూతనంగా లెక్కించిన సగటు నీటి లభ్యత 2578 టియంసిల నీటి నుండి బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కేటాయించిన 2130 టియంసిల నీటిని మినహాయించి మిగిలిన 448 టియంసిల నీటిని వివిధ రాష్ట్రాలకు కేటాయించింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ 1005 టియంసిల నీరు వాడుకొనే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014లోని 11 షెడ్యూల్ ప్రకారం మిగులు జలాలతో రాష్ట్రంలోని హంద్రీ-నీవా, తెలుగుగంగ, గాలేరు-నగరి, పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, తెలంగాణాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులు నిర్మించడానికి అనుమతిలభించింది.

మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అభ్యర్థన మేరకు కేంద్రప్రభుత్వం 1969లో గోదావరి నదీజలాల వివాదాల పరిష్కారాల వివాదాల పరిష్కారాల జస్టిస్ బచావత్ అధ్యక్షతన ఏర్పాటుచేసింది. 75శాతం విశ్వసనీయతతో గోదావరి నదిలో ప్రవహించే నీటిని 3216 టియంసిలుగా నిర్ధారించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1472.70 టియంసిల నీటిని కేటాయించింది. అలాగే పోలవరం ప్రాజెక్టునుండి కృష్ణానదికి తరలించే 80 టియంసిల నీటిలో ఎగువ రాష్ట్రాలకు 45టియంసిల నీటిని ఇచ్చారు. నేడు తెలంగాణా రాష్ట్రం గోదావరినదిలో మనకు ఎగువ రాష్ట్రమైనందున ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన 45టియంసిలలోనే వారి వాటాను కోరటం సముచితంగా ఉంటుంది. కృష్ణా-గోదావరి నదులలో ఆంధ్రప్రదేశ్ నీటి హక్కుల రక్షణకు ప్రభుత్వం తక్షణం పూనుకోవాలి. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు రైతాంగంపక్షాన ప్రభుత్వం తమ వాదనలు వినిపించేందుకు ఎటువంటి జాప్యం లేకుండా కృషి చేయాలి. ఈ నేపథ్యంలో మన రైతాంగం పక్షాన ఈ క్రింది అంశాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు ఉంచాలి.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 గత ట్రిబ్యునల్స్ వారి తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏవిధమైన అనుమతులు లేకుండా తెలంగాణా ప్రభుత్వం నిర్మిస్తున్న, నిర్మించాలని తలపెట్టిన ప్రాజెక్టులు, ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం - ఫేజ్-2, వలన దిగువ రాష్ట్రమైన మన ఆంధ్రప్రదేశ్‌కు జరిగే అనర్థాలను ట్రిబ్యునల్ వారికి నివేదించాలి. శ్రీశైలం ప్రాజెక్టు దిగువన నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుండి, తెలంగాణా 99 టి.యం.సిల నీటిని, ఆంధ్రప్రదేశ్ 33 టి.యం.సిల నీటిని వినియోగించుకోవలసి ఉన్నది. కాని, మన రాష్ట్రానికి రావలసిన 33 టి.యం.సిల నీరు, ముఖ్యంగా 3,4 జోన్లకు ఏ సంవత్సరంలో కూడా నీరందని పరిస్థితిని వివరించాలి.ఎగువ రాష్ట్రాలైన, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల వర్షపు నీటిని నిలువ చేసుకొనే విధానాలను అమలుపర్చటం వలన మనకు సకాలంలో నీరు లభించని పరిస్థితిని వివరించవలసి ఉన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా-గోదావరి నదులకు చివరి రాష్ట్రమైనందున, అటు వరదల వలన, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినపుడు, రైతాంగం నష్టపోయే పరిస్థితులను గమనించి తగిన పరిహారాన్ని అందచేయటానికి తగిన సూచనలను ఇవ్వవలసిందిగా ట్రిబ్యునల్‌ను కోరాలి.

గత కొన్ని సంవత్సరాలలో ఎగువనున్న రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం 1956, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014కు వ్యతిరేకంగా నిర్మిస్తున్న, నిర్మించిన ప్రాజెక్టుల నీటి వినియోగాన్ని ఆయారాష్ట్రాలకు కేటాయించిన నీటి పరిమాణాల నుంచి మాత్రమే నీటి వినియోగం కేటాయించవలసిన అవసరాన్ని తెలియచేయాలి. గోదావరి నది నీటిపంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. ప్రతి సంవత్సరం పులిచింతల ప్రాజెక్టులో 30.23 టియంసిల నీరు నిలువ ఉండేలా నిర్ణయించి అమలు చేయాలి. ప్రతి సంవత్సరం కృష్ణా డెల్టాకు జూన్ నెల మొదటివారంలో నారుమళ్ళు పెంచుకోవడానికి నీటిని విడుదలచేసి డెల్టాలోని కాలువలకు నీరందించే విధంగా విధి విధానాలు రూపొందించాలి. డెల్టా ప్రాంతంలోని సుమారు 70 లక్షల మంది ప్రజల తాగునీటి ఆవసరాలకు (మార్చి నుండి జూన్ వరకు) నాగార్జున సాగర్ నుండి నీటిని విడుదలచేయాలి. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులలో విద్యుత్ ఉత్పత్తిని వ్యవసాయ, సాగునీటి అవసరాలనుబట్టి అనుసంధానించాలి. ప్రతి సంవత్సరం మార్చి నుండి జూన్ వరకు విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లుకు వినతిపత్రాలు సమర్పించి ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకురానున్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలను చర్చించేందుకు రాజకీయపార్టీలు, రైతుసంఘాలు, సాగునీటిరంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని కోరుతున్నాను.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

సెల్: 9490952737

ఉపఎన్నికలకు ఎస్పీ కసరత్తు

ప్రదీప్ కపూర్

లోక్‌సభ ఎన్నికల విజయోత్సాహంలో ఉన్న సమాజ్‌వాదీపార్టీ యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉపఎన్నికల్లో మరో విజయదుందుబి మోగించాలన్న ఉత్సాహంతో పనిచేస్తున్నార. ఎన్నికల తేదీ ప్రకటించనప్పటికీ సమాజ్‌వాదీ పార్టీ నేతలు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు 2027లో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయనేది స్పష్టం. ఈ ఎన్నికల్లో పొత్తుతో పోటీ చేస్తామని రాహుల్, అఖిలేష్ యాదవ్ ఇప్పటికే బహిరంగ ప్రకటన చేశారు. మరోపక్క సీట్ల పంపకం విషయంలో సమాజ్‌వాదీ పార్టీ నాయకులు కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారు. ఉప ఎన్నికలు జరగనున్న 10 స్థానాల్లో కూటమి భాగస్వామ్య పక్షాలు బీజేపీని ఎదుర్కోవాల్సిన అభ్యర్థులతోపాటు సీట్ల విషయంలో అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారు. స్థానిక సమస్యలు ఎక్కువగా ఉండటంతో సమాజ్‌వాదీ పార్టీ 10 నియోజకవర్గాల్లోని అభ్యర్థుల నియామకంపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రతిష్టాత్మకమైన అయోధ్యలో ఓటమి చవిచూడడంతో బీజేపీ ఈ ఉప ఎన్నికల్లో ప్రతీకారాన్ని తీర్చుకునేందుకు వ్యూహం పన్నుతోంది. సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నాయకత్వం మొత్తం 10 స్థానాల్లో విజయం సాధించేందుకు మల్లగుల్లాలుపడుతున్నాయి. బీజేపీ తరఫు బరిలో నిలిచే అభ్యర్థులకు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు డజనుకు పైగా మంత్రులు, సీనియర్ నేతలను బీజేపీ రంగంలోకి దించనుంది.

దళితులు, మైనారిటీలు, అల్పసంఖ్యాక వర్గాలకు టిక్కెట్ల పంపిణీ ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తోడ్పడుతుందని సమాజ్‌వాదీ పార్టీ విశ్వసిస్తోంది. అఖిలేష్ యాదవ్ కూడా బీజేపీలో వర్గపోరును

ఆసరాగా చేసుకుని ఈ ఎన్నికల్లో విజయం సాధనదిశగా పావులు కదుపుతున్నారు. మరోపక్క ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వం, డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్య నేతృత్వంలోని రెండు శిబిరాల్లో కుమ్ములాటలు ఉన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా అగ్రవర్ణాలైన ఠాకూర్ సామాజికవర్గం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సన్నిహితంగా మెలుగుతుండగా మరోపక్క దళితులు, మైనారిటీలు కేశవ్ ప్రసాద్ మౌర్యకు మద్దతు ప్రకటించడం గ్రూపుతగాదాలను బహిర్గతపరచాయి. అయితే జూన్‌లో ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగే సమావేశాలను కేశవ్ ప్రసాద్ మౌర్య ఉద్దేశపూర్వకంగా బహిష్కరించారనేది తెలిసిందే. అయితే కూటమి భాగస్వాములైన బీఎస్పీ నాయకుడు నిషాద్ పార్టీ సుహెల్‌దేవ్ మౌర్యను కలుసుకుని బహిరంగంగా తమ మద్దతును తెలియజేశారు. దళితులు, ముస్లింల మద్దతుకోసం చూస్తున్న సమాజ్‌వాదీ పార్టీకి బీజేపీలోని అంతర్గత తగాదాలు, కుమ్ములాటల విభజన తోడ్పడనున్నాయి. టికెట్ల పంపిణీ విషయంలో సమాజ్‌వాదీ పార్టీ ఏడుసార్లు ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ స్పీకర్ మాతా ప్రసాద్ పాండేను ప్రతిపక్ష నాయకుడిగా నియమించడం ద్వారా బ్రాహ్మణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మాతా ప్రసాద్ పాండే గత అనుభవాల్ని ఈ ఎన్నికల్లో సమాజ్‌వాదిపార్టీ తనకు పూర్తి అనుకూలంగా మార్చుకోనుంది. ప్రతిపక్ష నాయకుడిగా పాండే నియామకం ముఖ్యంగా బ్రాహ్మణ ఓటర్లను ప్రబలంగా ప్రభావితం చేయనుంది.

సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే క్రిమినల్ కేసులో దోషిగా నిరూపణ కావడం, 9మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నికల పర్వానికి దారితీసింది. ఈ 10 అసెంబ్లీ సీట్లలో ఐదు సమాజ్‌వాదీ పార్టీ, మూడు బీజేపీ, ఆర్ఎల్‌డి, నిషాద్ పార్టీ ఒక్కొక్కటి గెలిచాము. బీజేపీ, కూటమి భాగస్వామ్య పక్షాలు గెలిచే ఐదు స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అత్యంత ఆసక్తిగా ఉంది. అఖిలేష్ యాదవ్, రాహుల్ గాంధీ మధ్య జరిగే చర్చలు ఈ సీట్ల కేటాయింపు ఆధారపడి ఉంటుంది. అయితే ఎన్నికల తేదీలు ప్రకటించనప్పటికీ, ఇండియా కూటమి- బీజేపీ మధ్య మొత్తం 10 స్థానాల్లో తీవ్ర పోటీ నెలకొంది.

వయనాడ్‌లో 100 ఇళ్లు కట్టిస్తాం: రాహుల్

వయనాడ్: కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి భారీఎత్తున ప్రాణనష్టం సంభవించింది. ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ తమ పార్టీ తరపున బాధితులకు 100కు పైగా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక అధికారులతో సమావేశం అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో ఇంతటి భయానక విషాదాన్ని మునుపెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా వాటి మాదిరిగా కాకుండా దీనిని భిన్నంగా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. ఈ ఘటనను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని చెప్పారు. ఆ ప్రాంతంలో జరిగిన ప్రాణ, ఆర్థిక నష్టం గురించి అధికారులు ఆయనకు వెల్లడించారు. ఈ విషాదం జాతీయ విపత్తని రాహుల్ అభివర్ణించిన సంగతి తెలిసిందే. వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండు చేశారు. తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీతో కలిసి గురువారం కొండ చరియలు విరిగిపడిన చురాల్‌మలలో రాహుల్ పర్యటించారు. శుక్రవారం కూడా వయనాడ్‌లోని ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదిలాఉంటే... ఈ విలయంలో సర్వం కోల్పోయిన వారికి మానసికంగా భరోసా కల్పించేందుకు కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 121 మంది మానసిక నిపుణుల బృందాన్ని వయనాడ్ పంపినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు.

జేపీ వెంచర్స్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక తవ్వకాలు జరిపిన జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన రూ. 18 కోట్ల జరిమానా నుంచి విముక్తి కల్పించాలని జేపీ సంస్థ చేసిన విజ్ఞప్తిని సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. కేసు తదుపరి విచారణ ఆగస్టు 31కి వాయిదా పడింది. ఆ లోగా అదనపు అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. జులై 30వ తేదీన ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఏమి చేయాలో ఆదేశిస్తామని సుప్రీం ధర్మాసనం తెలిపింది. వరదల కారణంగా అక్రమ ఇసుక తవ్వకాల ఆనవాళ్లు కొట్టుకుపోయాయని, వాటిని తేల్చడానికి శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ చేపట్టాలనుకుంటున్నామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. శాస్త్రీయ అధ్యయనానికి సంబంధించి కొన్ని సంస్థలను సంప్రదించామని, అన్నీ అధ్యయనం చేసి శాస్త్రీయ ఆధారాలతో నివేదిక అందించడానికి మూడు నెలలు గడువు కావాలని ఏపీ ప్రభుత్వం కోరింది. అక్రమ తవ్వకాలకు బాధ్యులైన ఏపీ ఎండీసీ మాజీ ఎండీ వెంకటరెడ్డిని సస్పెన్షన్ విషయాన్ని ఏపీ ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాది హుజేఫా అహ్మదీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర కమిటీని సుప్రీంకోర్టు నియమించింది. అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిగినట్లు కేంద్ర కమిటీ నిర్ధారించింది.

20 రోజుల్లో 14 మంది చిన్నారుల మృతి

ప్రభుత్వ ఆశ్రమంలో మిస్టరీ మరణాలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే ఓ ఆశ్రమంలో చిన్నారుల అనుమానాస్పద మరణాలు చర్చనీయాంశమయ్యాయి. గడిచిన 20 రోజుల్లోనే 14 మంది ప్రాణాలు కోల్పోవడం కలవరపెడుతోంది. అందులో ఎక్కువ మంది మానసిక వికలాంగులే కావడం కలచివేస్తోంది. మొత్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 27 మంది చనిపోగా... మరణాలకు గల కారణాలు తెలియకపోవడం వివాదాస్పదగా మారింది. దీనిపై వార్తలు రావడం, విపక్షాలు ఆందోళనలతో స్పందించిన 'ఆప్' ప్రభుత్వం పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. దేశ రాజధానిలో ఇటువంటి పరిణామం చోటుచేసుకోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి అతిశీ పేర్కొన్నారు. ఇటువంటి నిర్లక్ష్యాలను సహించేదిలేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. 48 గంటల్లోగా దీనిపై దర్యాప్తు జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ... నిజనిర్ధారణ బృందాన్ని అక్కడికి పంపించినట్లు చెప్పారు. మరోవైపు ఆశ్రమం ముందు బీజేపీ ధర్నా చేపట్టింది. ప్రాంగణంలోకి

చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించింది. తమకు ఉన్న సమాచారం ప్రకారం పిల్లలకు మురికి నీరు అందుతోందని, ఆహారం, చికిత్స సరిగా ఇవ్వడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. దిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఆశా కిరణ్ పేరుతో మానసిక వికలాంగుల ఆశ్రమం ఉంది. ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే ఈ ఆశ్రమం సాంఘిక సంక్షేమ శాఖ కిందకు వస్తుంది.

పైరసీతో ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టం: ఆప్ ఎంపీ

న్యూఢిల్లీ: పైరసీ రక్కసి రోజు రోజుకీ విజృంభిస్తుండటంతో చిత్ర పరిశ్రమ అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా చెప్పారు. ఒకప్పుడు చిత్ర పరిశ్రమకే పరిమితమైన పైరసీ ప్రస్తుతం అంటువ్యాధిలా ఓటీటీలకూ పాకిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా ఫిల్మ్ ఇండస్ట్రీకి ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోందన్నారు. శుక్రవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి తర్వాత ఓటీటీల పైరసీ 62 శాతం పెరిగిందని వెల్లడించారు. ఇది కళాకారుల సృజనాత్మకను దెబ్బతీయడంతో పాటు చిత్ర పరిశ్రమ ఆర్థిక స్థితిగతులను బలహీనం చేస్తోందన్నారు. గతేడాది సినిమాటోగ్రఫీకి సంబంధించి ఆమోదం పొందిన బిల్లులో థియేటర్‌లలో కెమెరా రికార్డింగ్ నిషేధంపై మాత్రమే దృష్టి సారించారన్నారు. ఆ బిల్లు ఇతర పైరసీలతో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొలేదన్నారు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు కేంద్రం ప్రత్యేక చట్టాలు ప్రవేశపెట్టాలని కోరారు.

ఐఏఎస్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.30 లక్షల సాయం

న్యూఢిల్లీ: దిల్లీలోని రావూస్ కోచింగ్ సెంటర్ విద్యార్థుల మృతికి నిరసనగా ఇటీవల సివిల్స్ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో దిల్లీలోని పలు కోచింగ్ సెంటర్లు మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకువచ్చాయి. వాజీరామ్ అండ్ రవి ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... రావూస్‌లో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు ఐఏఎస్ అభ్యర్థుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందచేస్తున్నట్లు తెలిపింది. ఘటన జరిగిన కోచింగ్ సెంటర్‌లోని ప్రస్తుత సెషన్ విద్యార్థులకు మిగిలిన తరగతులను రావూస్ ఫీజు లేకుండా బోధించనున్నట్లు తెలిపారు. తరగతి గదుల్లో ఒకదానిని తాత్కాలిక రీడింగ్ రూమ్‌గా మారుస్తామని, విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి 'స్టూడెంట్ కేర్ సెల్'ను సైతం ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. మరో కోచింగ్ సెంటర్ 'నెక్స్ట్ ఐఏఎస్' యాజమాన్యం స్పందిస్తూ... విద్యార్థుల మృతి వారి కుటుంబాలకు తీరని లోటు. ఏంచేసినా దానిని పూడ్చలేమని ఆవేదన వ్యక్తంచేశారు. మరే ఇతర అకాడమీల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు చెరో రూ. 10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. శ్రీరామ్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లుగా పేర్కొంది. రావూస్‌లో మరణించిన విద్యార్థులు, స్థానిక లక్ష్మీనగర్‌లో విద్యుదాఘాతంతో మరణించిన మరో విద్యార్థి నీలేష్‌రాయ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామంది. రావూస్ విద్యార్థులకు లైబ్రరీ సౌకర్యం ఏర్పాటు చేసుకునేవరకు వారు తమ లైబ్రరీలను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. వారం రోజుల క్రితం రావూస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు రావడంతో తాన్యా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ అనే ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టడంతో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌లను అరెస్టు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

మోదీ సర్కారు అబద్ధాలు సుప్రీంలో ఎండగడతాం

'9వ షెడ్యూలు' బాధ్యత కేంద్రానిదే

ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్

పాట్నా: ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బీహార్‌లో అణగారిన కులాల కోసం పెంచిన రిజర్వేషన్ కోటాకు చట్టబద్ధత కల్పించేలా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడంపై కేంద్రం పార్లమెంటును తప్పుదారి పట్టించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో 50 నుంచి 65 శాతానికి పెంచిన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని గత ఏడాది బీహార్‌లోని మహాఘట్బంధన్ సర్కారు కేంద్రాన్ని కోరింది. 1992లో సుప్రీంకోర్టు వెనుకబడిన తరగతులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. తేజస్వీ యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఆర్జేడీ రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా ఇటీవల ఈ విషయమై ఒక ప్రశ్న లేవనెత్తగా... సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ జూలై 31న లిఖితపూర్వక సమాధానంలో... రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెంచిన రిజర్వేషన్‌లను చేర్చడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని స్పష్టంగా చెప్పారన్నారు. మంత్రి తప్పు చేశారని...సభను తప్పుదారి పట్టించారని తేజస్వీ ఆరోపించారు.9వ షెడ్యూల్‌లో అంశాలను చేర్చడం కేంద్రం బాధ్యత అని, అందుకే మహాఘట్బంధన్ ప్రభుత్వం దాని కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో కోర్టులలో సవాలు చేయలేని కేంద్ర, రాష్ట్ర చట్టాల జాబితా ఉంది. రాష్ట్రంలోని కొత్త రిజర్వేషన్ చట్టాలను రద్దు చేస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని... సుప్రీం కోర్టులో కేంద్రం అబద్ధాలను ఎండగడతామని వెల్లడించారు. దీనికి సంబంధించి సోమవారం సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేస్తామని ఆయన చెప్పారు. సమాజంలోని అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల కల్పనకు కేంద్రంతో పాటు రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వ్యతిరేకమని తేజస్వీ దుయ్యబట్టారు.

ఈ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనను ప్రారంభించాలని ఆర్జేడీ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.

రైల్వేలో బేబీ బెర్తులు: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంత ప్రయాణం అందించేందుకు రైల్వేశాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. తల్లుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చేందుకు పిల్లల కోసం బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. రైలు బోగీలలో బేబీబెర్త్‌లు అమర్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందా అని బీజేపీ ఎంపీ సమర్ సింగ్ సోలంకీ ప్రశ్నించారు. దానికి మంత్రి స్పందిస్తూ... 'లక్నో మెయిల్‌లో రెండు బేబీ బెర్త్‌లను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చాం. లక్నో మెయిల్‌లోని ఒక కోచ్‌లో రెండు దిగువ బెర్త్‌లకు వాటిని అమర్చాం. దీనిపై ప్రశంసలు అందాయి. అయితే సామాన్లు పెట్టుకునే స్థలం తగ్గిపోవడం, సీట్ల మధ్య దూరం తగ్గడం వంటి సమస్యలు మా దృష్టి వచ్చాయి. ప్యాసింజర్ బోగీలలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి. అది నిరంతర ప్రక్రియ' అని మంత్రి వెల్లడించారు. బేబీ బెర్తులు... పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చిన్నపాటి పడకలు. లోయర్ బెర్త్‌కు అటాచ్ అయి ఉంటాయి. ప్రయాణ సమయంలో తల్లులు ఈ బెర్త్‌పై తమ చిన్నారులను పడుకోబెట్టుకోవచ్చు. సాధారణంగా అయితే... ఒకే బెర్త్‌పై తల్లీబిడ్డా సర్దుబాటు కావాల్సి ఉంటుంది. దీంతో స్థలం సరిపడక ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు బేబీ బెర్త్ సాయంతో పిల్లల్ని తమ పక్కనే సురక్షితంగా పడుకోబెట్టొచ్చు. అవసరం లేనప్పుడు దీన్ని లోయర్ బెర్త్ కిందికి మడతపెట్టొచ్చు. శిశువును సురక్షితంగా ఉంచడానికి పట్టీలూ ఉన్నాయని గతంలో అధికారులు వెల్లడించారు.

సమర్ధవంత పాత్ర అవశ్యం

- కేంద్రం... రాష్ట్రాల మధ్య వారధులు మీరే
- గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ
- సమన్వయంతో కేంద్ర సంస్థలు: రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ : కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సమర్థవంతమైన వారధి పాత్ర పోషించాలని, నిరుపేదలకు సహకరించే విధంగా ప్రజలు, సామాజిక సంస్థలతో సంభాషించాలని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం గవర్నర్లను కోరారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించి, అధ్యక్షత వహించిన రెండు రోజుల గవర్నర్ల సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ రాజ్యాంగం పరిధిలోని ప్రజలు, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమంలో కీలక పాత్ర పోషించగల ముఖ్యమైన సంస్థ గవర్నర్ పదవి అని అన్నారు. రాష్ట్రపతి ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రారంభ సమావేశంలో ప్రసంగించారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారంతో ముగియనున్న ఈ సదస్సులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలను రూపొందించడమే కాకుండా సామాన్య ప్రజల సంక్షేమ పథకాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక అంశాలపై చర్చిస్తారు. రాష్ట్రపతి ముర్ము ప్రారంభోపన్యాసం చేస్తూ, ప్రజాస్వామ్యం సజావుగా సాగేందుకు అన్ని రాష్ట్రాలలో వివిధ కేంద్ర సంస్థలు మెరుగైన సమన్వయంతో పనిచేయడం చాలా కీలకమని అన్నారు. తమ తమ రాష్ట్రాల రాజ్యాంగ అధిపతులుగా ఈ సమన్వయాన్ని ఎలా ప్రోత్సహించవచ్చో ఆలోచించాలని గవర్నర్లకు సూచించారు. ఈ సదస్సు అజెండాలో జాతీయ లక్ష్యాలను సాధించడంలో కీలకమైన అంశాలను జాగ్రత్తగా ఎంచుకున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. సదస్సు చర్చలు పాల్గొనే వారందరికీ సుసంపన్నమైన అనుభూతిని కలిగిస్తుందని, వారి పనితీరులో వారికి సహాయపడుతుందని అన్నారు. గవర్నర్లందరూ ప్రజల సేవకు, సంక్షేమానికి పాటుపడతారని, వారి ప్రమాణానికి న్యాయం చేస్తారని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. నేర న్యాయానికి సంబంధించి మూడు కొత్త చట్టాలను అమలు చేయడంతో, దేశంలో న్యాయ వ్యవస్థలో కొత్త శకం ప్రారంభమైందని ముర్ము చెప్పారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే చట్టాల పేర్ల నుంచి ఆలోచనలో మార్పు స్పష్టంగా కనిపించిందని తెలిపారు. నాణ్యమైన ఉన్నత విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక మార్పుతో పాటు ఆవిష్కరణ, ఆర్థిక పురోగతిని ప్రోత్సహిస్తుందని, ఇది కనిపించని ఆస్తి అని అన్నారు. జాతీయ విద్యా విధానం విద్యా సంస్థల అక్రిడిటేషన్, మూల్యాంకన వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి పెట్టిందని రాష్ట్రపతి తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ల హోదాలో గవర్నర్లు ఈ సంస్కరణ ప్రక్రియకు సహకరించాలన్నారు. పేదలు, సరిహద్దు ప్రాంతాలు, అణగారిన వర్గాలు, అభివృద్ధి ప్రయాణంలో వెనుకబడిన ప్రాంతాలు, ప్రజల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల సమ్మిళిత అభివృద్ధికి మార్గాలను సూచించాలని ఆమె గవర్నర్లను కోరారు. యువత శక్తిని సానుకూలంగా, నిర్మాణాత్మకంగా మార్చగలిగితే 'యువత అభివృద్ధి', 'యువత నేతృత్వంలోని అభివృద్ధి' మరింత ఊపందుకుంటాయని ముర్ము అన్నారు.

సమైక్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేసేందుకు గవర్నర్లు సహకరించాలని కోరారు. వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని పెంచవచ్చని రాష్ట్రపతి చెప్పారు. ఉప రాష్ట్రపతి ధన్కర్ తన ప్రసంగంలో గవర్నర్ల ప్రమాణాన్ని ప్రస్తావిస్తూ, సామాజిక సంక్షేమ పథకాలు, గత దశాబ్దంలో జరిగిన అద్భుతమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించే వారి రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలని వారిని కోరారు. రెండు రోజుల సదస్సులో జరిగే చర్చల తీరుతెన్నులను వివరించిన అమిత్ షా... ప్రజల్లో విశ్వాసాన్ని నింపేందుకు, అభివృద్ధి పనులకు ఊతమిచ్చేలా 'చైతన్యవంతమైన గ్రామాలు' 'ఆపేక్షాత్మక జిల్లాలు' సందర్శించాలని గవర్నర్లను కోరారు.

ఎస్‌పీ ఎంపీపై ఈడీ చర్యలు

జాన్‌పూర్: ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాద్ పార్టీ జాన్‌పూర్ ఎంపీ బాబు సింగ్ కుష్వాహపై ఈడీ చర్యలకు దిగింది. లక్నోలోని కాన్పూర్ రోడ్డులో స్కూటర్ ఇండియాలో కోట్లు విలువచేసే భూమిని స్వాధీనం చేసుకుంది. ఈడీ బృందం బుల్డోజర్‌ను రప్పించి ఆ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలు కూల్చేసింది. మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ ఈ చర్య తీసుకుంది. 2007లో మాయావతి ముఖ్యమంత్రిగా, బాబు సింగ్ కుష్వాహ మంత్రిగా ఉన్నప్పటి కేసు ఇది. కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 2005లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పథకం ప్రారంభించింది. మాయావతి ప్రభుత్వం కేంద్రం నిధులు దిగమింగినట్లు ఆరోపణలు ఎదుర్కొంది. 2010, 2011లో యూపీలోని ఇద్దరు సీఎంఓలు డాక్టర్ వినోద్ ఆర్య, డాక్టర్ బీపీ సింగ్ హత్యకు గురికావడంతో ఈ అవినీతి కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కుంభకోణం కేసులో ఉన్న డిప్యూటీ సీఎంఓ డాక్టర్ వైఎస్ సచిన్ జైలులోనే శవమై కనిపించారు. ఎన్‌హెచ్‌ఆర్‌ఎం అవినీతి కేసులో బాబు సింగ్ కుష్వాహ నిందితుడిగా ఉండగా, ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలపై ఈడీ విచారణ జరుపుతోంది. అవినీతి ఆరోపణలతో అప్పట్లో కుష్వాహ రాజీనామా చేశారు. పదేళ్ల పాటు ఆయన రాజకీయ ప్రయాణం వెనుకబాట పట్టింది. 2024లో సమాజ్‌వాదీ పార్టీ ఆయనకు జాన్‌పూర్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది. ఆయన తన సమీప బీజేపీ ప్రత్యర్థిపై లక్ష ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రస్తుతం బాబూ సింగ్ కుష్వాహ లోక్‌సభలో సమాజ్‌వాది పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్నారు.

2027 నాటికి 25 వేల జన ఔషధి కేంద్రాలు: అనుప్రియ పటేల్

న్యూఢిల్లీ: 2027 మార్చి 31నాటికి దేశవ్యాప్తంగా 25 వేల జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. ఈ ఏడాది జూన్ నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా 12,616 కేంద్రాలు నెలకొల్పినట్లు ఆమె వెల్లడించారు. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన పథకంపై లోక్‌సభలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ పథకం కింద ఇప్పటివరకూ ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంత మేర అమ్మకాలు జరిగాయని బాలశౌరి ప్రశ్నించారు. దీనికి స్పందించిన మంత్రి అనుప్రియ పటేల్...గత ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా రూ.3,548.79 కోట్ల విలువైన ఔషధాలు అమ్మినట్లు, 2027నాటికి 25 వేల కేంద్రాలు ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రూ.8.34 కోట్ల మందులు అమ్మినట్లు, మచిలీపట్నంలో ఏడు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

స్కూల్‌కు బాంబు బెదిరింపు... యాజమాన్యం అప్రమత్తం

న్యూఢిల్లీ: దక్షిణ దిల్లీలోని సమ్మర్ ఫీల్డ్స్ స్కూల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వివరాలివి. పాఠశాలకు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అయితే శుక్రవారం పాఠశాలకు వచ్చిన అనంతరం స్కూల్ యాజమాన్యం ఈ మెయిల్‌ను గమనించింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యార్థులను బయటకు పంపించి, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇటీవల విమానాశ్రయాలు, ఆసుపత్రులు, పాఠశాలలకు బూటకపు బాంబు బెదిరింపు కాల్స్ వస్తున్న నేపథ్యంలో ఇది కూడా బూటకపు మెయిల్ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

టెల్ అవీవ్‌కు విమానాల నిలిపివేత

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్- దిల్లీ మధ్య ఎయిరిండియా విమాన సర్వీసులను ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రద్దు చేశామని ఎయిరిండియా ప్రకటన చేసింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి సర్వీసుల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటాం. ఈ నెల ఎనిమిదో తేదీ వరకు దిల్లీ నుంచి టెల్ అవీవ్ ప్రయాణించేందుకు టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు మాత్రం మినహాయింపు ఉంటుంది. టికెట్ల రద్దు, రీ షెడ్యూలింగ్‌పై ఒకసారి ఛార్జీల మినహాయింపు ఇస్తాం. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయం తీసుకున్నాం. సమాచారం కోసం 011-69329333, 011-69329999కి కాల్ చేయాలి అని' ఎయిర్ ఇండియా యజమాన్యం కోరింది. ఇదిలా ఉండగా... హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా హత్యతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్‌పై ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ స్పష్టం చేసింది. ప్రత్యక్ష దాడులకు దిగాలని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆదేశాలు ఇచ్చినట్టు వార్తలొచ్చాయి. ఇజ్రాయెల్‌ను వదలబోమని హమాస్ సంస్థ కూడా ప్రకటన చేసింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు అధికమయ్యే అవకాశం ఉండడంతో ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. దిల్లీ -టెల్ అవీవ్ మధ్య వారానికి నాలుగు సర్వీసులను ఎయిర్ ఇండియా నడుపుతోంది.

పూజా ఖేడ్కర్ దారిలో మరో ఆరుగురు

న్యూఢిల్లీ: యూపీఎస్‌సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు రావడంతో మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. ఈ కేసు నేపథ్యంలో ఆరుగురు సివిల్ సర్వెంట్ల వైకల్య ధ్రువీకరణ పత్రాలు కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. వారి మెడికల్ సర్టిఫికెట్లను సిబ్బంది, శిక్షణ విభాగం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ ఆరుగురిలో ఐదుగురు ఐఏఎస్‌లు, ఒక ఐఆర్ఎస్ ఉన్నారని సమాచారం. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్‌సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. నకిలీపత్రాలతో పరీక్ష రాసినట్లు గుర్తించిన యూపీఎస్‌సీ... దానిపై వివరణ ఇవ్వాలని పూజా ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులిచ్చింది. దీనిపై ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. భవిష్యత్తులో యూపీఎస్‌సీకి చెందిన ఎలాంటి పరీక్షలు రాయకుండా శాశ్వత నిషేధం విధించింది. ప్రస్తుతం ఆమె ఆచూకీ తెలియడం లేదు. మోసం, ఫోర్జరీ కేసులో ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు దిల్లీ కోర్టు నిరాకరించడంతో ఆమె దుబాయ్‌కి పరారైనట్లు తెలుస్తోంది.

అక్బర్, సీత సింహాల పేర్ల మార్పు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని శిలిగుడి సఫారీ పార్కులో అక్బర్, సీత పేర్లు కలిగిన మగ, ఆడ సింహాలను ఒకే ఎన్‌క్లోజర్‌లో ఉంచడం తీవ్ర వివాదానికి దారితీయడంతో తాజాగా వాటి పేర్లు సూరజ్, తాన్యాగా మారుస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సింహాల పేర్లు మార్చడంతో ఈ కేసు వివాదం ఇంతటితో ముగిసినట్లు అదనపు అడ్వకేట్ జ్యోతి చౌదరి పేర్కొన్నారు. త్రిపుర నుంచి బెంగాల్‌కు అప్పగించే సమయంలో సింహాలు ఈ పేర్లు కలిగిఉన్నాయని రుజువయిందన్నారు. సింహాల పేర్లు మారడంతో వీహెచ్‌పీ హర్షం వ్యక్తం చేసింది.

నైతికంగా ఓడిన మోదీ

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తణుకు : లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తామని గొప్పలకు పోయిన ప్రధాని నరేంద్ర మోదీని ప్రజలు 240 స్థానాలకు పరిమితం చేసి తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక వంకా సత్యనారాయణ స్వరాజ్య భవనంలో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి విస్తృత సర్వసభ్య సమావేశం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు సభ్యులకు, అతిథులకు ఆహ్వానం పలికారు. ముఖ్య అతిథి ముప్పాళ్ల మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు, సీట్లు తగ్గడం ద్వారా ప్రజల్లో ఆ పార్టీ పట్ల పట్ల ఉన్న అసంతృప్తి వెల్లడయిందని, నరేంద్ర మోదీ నైతికంగా ఓడిపోయి సాంకేతికంగా గెలిచారన్నారు. తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ) తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ఎన్నికల హామీలు అమలు చేయలేదని, నోట్ల రద్దు ద్వారా నల్లధనం తెల్లగా మారిందని, ఈ ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలను ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుందని ఇదంతా నల్లధనమేనని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్ రుణాలు మాఫీ చేసిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు కొంతమంది వేల కోట్ల రూపాయలు రుణాలు తీసుకుని బ్యాంకులకు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయారని, అందులో విజయ మాల్య తప్ప మిగతా అందరూ గుజరాత్‌కు చెందినవారేనని తెలిపారు. ప్రధాని మోదీ సన్నిహితుడు అదానీ డ్రగ్ స్మగ్లర్ అని, మోదీ అండతో దేశంలోని అన్ని పోర్టులు లాక్కుంటున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో గత 5 ఏళ్లలో కక్ష సాధింపు చర్యలు, అప్రజాస్వామిక పాలన వల్ల జగన్ ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలయ్యారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ దారుణాలకు వ్యతిరేకంగా పోరాడిన సీపీఐ రాష్ట్రంలో 100 శాతం విజయం సాధించిందని, కేంద్రంలో బలమైన ప్రతిపక్షాన్ని ఏర్పాటు చేయగలిగిందని ముప్పాళ్ల తెలిపారు. దేశంలో ఏ ఒక్క చట్టమైనా, పథకాలయిన కమ్యూనిస్టుల కష్టాల ఫలితమేనన్నారు. సీపీఐ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు చేరువ కావాలని కోరారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేకత అని అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తికి ప్రధాని మోదీ తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. ఈసారి పార్లమెంటులో బలమైన ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. గతంలో ప్రతిపక్షాన్ని బయటకు పంపి ఆమోదించిన నేర చట్టాలను అమలు చేస్తున్నారని, దీనిపై చర్చిద్దామని ప్రతిపక్షాలు చెబుతున్నా మోదీ పట్టించుకోలేదని, కొత్త నేర చట్టాలు ప్రమాదకరమైనవని తెలిపారు. బీజేపీ జమ్మూకశ్మీర్‌లో ఎందుకు పోటీ చేయలేదని సూటిగా ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకునే ప్రధాని మోదీ తెలుగుదేశం పార్టీని అడ్డుపెట్టుకుని చిచ్చు పెడుతున్నారని, దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితుల ప్రయోజనాలకే సీపీఐ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను చంద్రబాబు నియంత్రించాలని, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని రూపొందించాలని చెప్పారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. సీపీఐ ప్రతి శాఖ ప్రతినెలా సమావేశాలు నిర్వహించి, ప్రజా సమస్యలపై అధికారులను కలిసి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రానున్న రోజుల్లో వార్డు, మున్సిపాలిటీ, మండలాలు, గ్రామాలలో ఎన్నికల్లో పోటీ చేసేలా బలాన్ని పెంచుకోవాలని, అందుకోసం నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఆర్థికపరమైన పుష్టిని కూడగట్టుకునేందుకు నిధులను సమకూర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకటరావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, చెల్లుబోయిన రంగారావు, కళింగ లక్ష్మణరావు, నెక్కంటి క్రాంతికుమార్, జిల్లా సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వయనాడ్ కోసం విరాళాలివ్వండి: సీపీఐ

న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 300 మందికిపైగా మరణించగా మరో 300 మంది ఆచూకీ లేకుండా పోయారు. ఈ విపత్తుకర పరిస్థితుల్లో వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. ఎవరికి తోచిన సాయం వారు చేయాలని కోరింది. ఇదే క్రమంలో శుక్రవారం దిల్లీలోని కనాట్ ప్లేస్‌లో విరాళాలు సేకరించింది. వయనాడ్ బాధితులకు మీ వంతు సాయాన్ని అందించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, సీపీఐ జెండాలు పట్టుకొని నేతలు నిధి సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు కె.నారాయణ, డాక్టర్ భల్‌చంద్ర కాంగో, రామకృష్ణ పాండాతో పాటు పార్టీ దిల్లీ శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే పాల్గొన్నారు.

ఏపీ మెట్రో రైల్ ఎండీగా రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీలో మెట్రో రైల్ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో విశేషమైన అనుభవం గల రామకృష్ణారెడ్డిని మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీగా నియమించినట్లు వివరించింది. మూడేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో తెలిపింది. గతంలోనూ ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత ఎండీ జయమన్మథరావును రిలీవ్ చేస్తూ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఎస్‌పీపై బీజేపీ రాజకీయ క్రీడ

పంజాబ్ రైతుల నిరసన

ప్రధాని దిష్టిబొమ్మల దహనం

అమృత్‌సర్: పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించే హామీపై బీజేపీ రాజకీయ క్రీడ కొనసాగిస్తోందని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత లభించేంత వరకు రైతాంగ పోరు ఆగబోదని స్పష్టంచేసింది. పంజాబ్ వ్యాప్తంగా నిరసనలు చేపట్టి ప్రధాని దిష్టిబొమ్మలు దహనం చేసింది. ఈ సందర్భంగా కేఎంఎస్‌సీ ప్రధాన కార్యదర్శి సర్వర్ సింగ్ పంధేర్, నాయకుడు మంగల్ సింగ్ రాంపుర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపించారు. రైతులను కవ్వించేలా సర్కార్ ప్రవర్తిస్తోందని అన్నారు. దిల్లీకి కదం తొక్కిన రైతులతో విచక్షణారహితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులను సన్మానిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి చర్యలతో రైతులను కేంద్రం రెచ్చగొడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగబోదని నాయకులు స్పష్టంచేశారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించారు. నిరాయుధ రైతులపై కాల్పులకు తెగబడటం సాహసం కాదని... ప్రభుత్వమిచ్చిన అన్యాయ ఉత్తర్వుల ఆచరణకు ప్రతీకని పంధేర్ వ్యాఖ్యానించారు. రైతులు కూడా పౌరులేనని, దిల్లీ వెళ్లేందుకు వారికి హక్కు ఉందని ప్రభుత్వానికి తేల్చి చెప్పి ఉంటే ధీరత్వం అనిపించుకునేదని అన్నారు. శాంతియుత నిరసనను హింసాత్మకంగా మార్చి... రైతులపై కాల్పులు జరిపిన ఆరుగురు పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలివ్వాలని హర్యానా ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. నిరాయుధులపై కాల్పులు జరిపి తామేదో సాహసోపేతమైన కార్యాన్ని పూర్తి చేసినట్లు భావిస్తే ఎంత మాత్రం సమంజసం కాదని... రైతుల గాయాలపై కారం చల్లే పనిని హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని పంధేర్ మండిపడ్డారు. గతేడాది శంభు-ఖనౌరి సరిహద్దుల వద్ద ఖాకీ క్రౌర్యం ఒక రైతు ప్రాణాలు తీయగా, అనేక మందికి గాయాలయ్యాయని గుర్తుచేశారు. ఎంఎస్‌ఎప్పీ చట్టాన్ని సాధించే వరకు శంభు సరిహద్దు వద్ద పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. రైతుల ఉద్యమాన్ని అణచివేసేందుకు బీజేపీ నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు కానీ అవేమీ ఫలించబోవని పంధేర్ వెల్లడించారు.

అక్రమ కోచింగ్ సెంటర్లపై చర్యలు

ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

జంతర్ మంతర్ వద్ద ధర్నా

న్యూదిల్లీ: దిల్లీలోని రాజేంద్రనగర్‌లో గల రావూస్ కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా మరణించిన అభ్యర్థులకు మద్దతుగా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరును నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సంయుక్త అధ్వర్యంలో దిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం ధర్నా జరిగింది. ధర్నాలో రెండు సంఘాల జాతీయ, ఆయా రాష్ట్రాల బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థుల మరణాలను నిర్లక్ష్యపు హత్యలుగానే భావించాలని స్పష్టంచేశారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని అనధికారికంగా దిల్లీలో వందలాది కోచింగ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని ఆరోపించారు. బహుళ అంతస్థుల భవనాలలో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ... వికృత విద్యా మాఫియాను నడిపిస్తున్నాయని మండిపడ్డారు. నిబంధనలకు పాతర వేస్తూ సెల్లార్‌లలో గ్రంథాలయాలను, తరగతులు నడుపుతూ అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారని చెప్పారు. దిల్లీలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బహుళ అంతస్థులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సుఖేందర్ మహేసరి, తిరుమలై రామన్, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి విరాజిత్, దినేశ్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవితో పాటు దిల్లీ, తమిళనాడు, జార్ఖండ్, కర్నాటక, బీహార్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన బాధ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు పోటెత్తిన వరద

10 గేట్లను 20 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువన ఉన్న జలాశయాలకు కృష్ణమ్మ వరద పోటెత్తుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నుంచి ఆనకట్టపై 10 గేట్లను 20 అడుగుల మేర ఎత్తి దిగువకు 4,66,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే సమయానికి ఎగువ జూరాల నుంచి 3,21,633 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 1,67,728 క్యూసెక్కులతో కలిపి 4,89,361 క్యూసెక్కులు జలాశయానికి చేరుతున్నాయి. జలాశయం నీటిమట్టం 883.30 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరింది. నీటి నిలువ సామర్థ్యం 206.0996 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మల్యాల కేసీసీకి 253 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 25 వేల క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్లకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే ఆంధ్ర రాష్ట్ర పరిధిలోని కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో గడచిన 24 గంటలలో 14.159 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 23,904 క్యూసెక్కులను, తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 17.732 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,857 క్యూసెక్కులను దిగువ నాగార్జున సాగర్‌కు 61,761 క్యూసెక్కులతో పాటు 10 గేట్ల ద్వారా కలిపి 5, 28,411 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మట్టిమిద్దె కూలి నలుగురి మృతి

మృతులంతా కుటుంబ సభ్యులే

విశాలాంధ్ర-చాగలమర్రి: మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలిలో జరిగింది. మృతులను భార్యాభర్తలు గురుశేఖర్‌రెడ్డి(45), దస్తగిరమ్మ(38), వారి కుమార్తెలు పవిత్ర(16), గురులక్ష్మి(10)గా గుర్తించారు. గురువారం అర్ధరాత్రి మట్టి మిద్దె కూలడంతో నిద్రలో ఉన్న ఆ నలుగురు తమ ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు శుక్రవారం తెల్లవారుజామున దీనిని గమనించి శిథిలాలను తొలగించి మృతదేహాలను వెలికితీశారు. నలుగురు కుటుంబ సభ్యుల మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబంలో మొత్తం ఐదుగురు ఉండగా.. రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుతోంది. ఇప్పుడు ఆమె ఏకాకిగా మిగిలింది. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంత్ నాయక్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆళ్ళగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు విజయ్‌కుమార్ కూడా గ్రామానికి వెళ్లి ఆరా తీశారు. ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

9న 'క్విట్ కార్పొరేట్' జయప్రదానికి

వడ్డే, కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 9న క్విడ్ కార్పొరేట్‌గా జరపాలని, అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో రైతులను, ఇతర వర్గాలను కలుపుకుని పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వానికి నిరసనలు తెలియజేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలును కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కానీ బడా కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రాయితీలు, రుణాలను మంజూరు చేస్తోందన్నారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలనే డిమాండ్ నేటికీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగంతో పాటు వివిధ రంగాలను కార్పొరేట్లకే అప్పగిస్తోందని, దానికి నిరసనగా ఈనెల 9న క్విట్ కార్పొరేట్ నినాదంతో ఎద్దఎత్తున నిరసనలకు పిలుపునిస్తున్నామన్నారు. కేంద్రం గతంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని, మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో పాటు విద్యుత్ బిల్లు ఉపసంహరించుకుంటామని ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచి రైతాంగాన్ని మోసం చేసిందని విమర్శించారు. నేడు వ్యవసాయ రంగంలో దేశంలో కోట్ల మంది ఉంటే వారికి అవసరమైన బ్యాంకు రుణాలు ఇవ్వకుండా, కౌలు రైతులను కూడా పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థల అధినేతలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేకమైన బడ్జెట్ తీసుకువచ్చే విధంగా ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, మారపు సూర్యనారాయణ, డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎం.వెంకటరెడ్డి, లంక కృష్ణమూర్తి, మన్నవ హరిప్రసాద్, మరీదు ప్రసాద్ బాబు, కాలువ శ్రీధర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, ఆంజనేయులు, కాసాని గణేష్ బాబు, కొప్పుల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి పునరుద్ధరణకు అంగీకారం

ఇంఫాల్: మణిపూర్‌లోని జిరిబమ్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు మయితే, హమర్ వర్గాలు సంకల్పించాయి. అసోంలోని కాచర్‌లో సీఆర్పీఎఫ్ స్థావరంలో జరిగిన సమావేశంలో ఈ రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. జిరిబమ్ జిల్లా యంత్రాంగం, అసోం రైఫిల్స్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో పాటు జిల్లాలోని థాడో, పైతె, మిజో వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం వెలువడిన సంయుక్త ప్రకటన ప్రకారం కాల్పులు, నిప్పుపెట్టడం వంటివి నివారించడమే కాకుండా తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు రెండు పక్షాలు సంకల్పించినట్లు వెల్లడైంది. ఇందుకోసం భద్రతా దళాలకు పూర్తిగా సహకరిస్తామని ప్రతినిధులు ప్రతిజ్ఞ బూనినట్లు ప్రకటన తెలిపింది. అలాగే తమ ఉద్యమాన్ని నియంత్రిస్తామని కూడా హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. తదుపరి సమావేశం ఈనెల 15న జరగబోతోందని ప్రకటన పేర్కొంది. కాగా, గతేడాది మే నుంచి కుకీ-మయితే వర్గాల మధ్య హింసతో ఈశాన్య రాష్ట్రం అట్టుడికిపోతోంది. 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది శిబిరాల్లో ఉన్నారు. వారి పరిస్థితి నేటికీ అగమ్యగోచరంగా ఉంది.

అమరావతిలో భవనాలు పరిశీలించిన ఐఐటీ హైదరాబాద్ బృందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం పరిశీలించింది. అనంతరం ఐఐటీ ప్రొఫెసర్లు సుబ్రమణ్యం, మున్వర్ బాషా మీడియాతో మాట్లాడారు. భవనాల పటిష్టత, సామర్థ్యం, నిర్ధారణకు మరికొంత సమయం పడుతుందని చెప్పారు. భవనాల ప్రస్తుత స్థితి, నిలిచి ఉన్న వర్షపు నీటి ప్రభావం, నిర్మాణ సామగ్రి తాజా స్థితిగతులను అంచనా వేయాల్సి ఉంటుందని తెలిపారు. సాంకేతికంగా వాటిని పూర్తిగా పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. నివేదికకు ఎంతకాలం పడుతుందనేది ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమనీ, సాధ్యమైనంత త్వరగానే నివేదికను ప్రభుత్వం, సీఆర్డీఏకు అందజేస్తామని తెలిపారు.

మూడో పతకంపై మను 'గురి'

- '25 మీటర్ల పిస్టల్' పోరులో ఫైనల్‌కు చేరిన యువ షూటర్
- సత్తాచాటిన భారత ఆర్చర్లు, ఆసీస్‌పై హాకీ జట్టు విజయం

న్యూదిల్లీ: భారత యువ షూటర్ మను బాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో ముచ్చటగా మూడో పతకానికి గురిపెట్టింది. ఇప్పటికే ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించి కోట్లాదిమంది భారత క్రీడాభిమానుల అభిమానం చూరగొన్న మను... తాజాగా మరో విభాగంలోనూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. షూటింగ్ మహిళల 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫికేషన్ పోరులో టాప్ 2లో నిలిచి తుది పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన క్వాలిఫికేషన్‌లో తొలుత ప్రిసిషన్ రౌండ్‌లో 294 పాయింట్లు సాధించి టాప్ 3లో నిలిచిన మను...ఆ తర్వాత ర్యాపిడ్ రౌండ్‌లో మరింత పుంజుకుంది. ర్యాపిడ్ తొలి సిరీస్‌లో ఏకంగా 100 పాయింట్లు సాధించింది. ఈ రౌండ్‌లో 296 స్కోరు దక్కించింది. మొత్తంగా 590 పాయింట్లతో రెండో స్థానానికి దూసుకెళ్లి.. మరో పతకానికి అడుగు దూరంలో నిలిచింది. శనివారం ఫైనల్ పోరు జరగనుంది. ఇదే విభాగంలో పోటీ పడిన మరో భారత షూటర్ ఇషా సింగ్ 581 పాయింట్లతో 18వ స్థానానికి పరిమితమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో మను పతకం సాధిస్తే.. ఈ ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ పతకాలతో భారత ఒలింపిక్ చరిత్రలో సరికొత్త రికార్డును లిఖించనుంది. ఇప్పటికే ఈ ఒలింపిక్స్‌లో ఈ యువ షూటర్ రెండు కాంస్య పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. తొలుత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. ఆ తర్వాత మరో షూటర్ సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించి ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన సంగతి విదితమే.

పతకంపై ఆశలు రేపిన ఆర్చర్లు

ఒలింపిక్స్‌లో భారత ఆర్చర్లు సత్తా చాటారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్, అంకిత భకత్ ద్వయం అద్భుత ప్రదర్శనతో సెమీ ఫైనల్‌కు చేరింది. దీంతో వీరు పతకానికి మరో అడుగు దూరంలో ఉన్నారు. క్వార్టర్స్ ఫైనల్‌లో అంకిత, ధీరజ్ ద్వయం 5-3 తేడాతో స్పెయిన్‌పై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఈ జోడి.. ఇండోనేషియా ద్వయం ఆరిఫ్-కోరునిసాపై 5-1తో విజయం సాధించిన విషయం తెలిసిందే. సెమీస్‌లో ఈ జంట దక్షిణ కొరియా లేదా ఇటలీతో తలపడనుంది. ఒలింపిక్స్ ఆర్చరీ మిక్స్‌డ్ డబుల్స్ చరిత్రలో భారత్ సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. ఇక ఒలింపిక్స్ గ్రూప్ చివరి మ్యాచ్‌లో భారత హాకీ జట్టు విజయం సాధించింది. ఆస్ట్రేలియాపై 3-2 తేడాతో గెలుపొందింది. పూల్ బి నుంచి ఇప్పటికే భారత్, బెల్జియం, ఆసీస్ క్వార్టర్ ఫైనల్ చేరాయి. ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఓడించడం 1972 తర్వాత ఇదే తొలిసారి.

నాడు పీజీ సీటు రూ.13 కోట్లు : నడ్డా

న్యూదిల్లీ: అక్రమాలకు కేరాఫ్‌గా మారిన నీట్ పరీక్షను కేంద్రప్రభుత్వం సమర్థించుకుంటోంది. వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష లేనప్పుడు ఒక్కో పీజీ సీటును రూ.8 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు అమ్ముకునే వారని, వైద్య విద్య వ్యాపారంగా మారిందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. నీట్‌పై ఎంపీ ఎం.మహమ్మద్ అబ్దుల్లా ప్రతిపాదించిన ప్రైవేటు బిల్లుపై చర్చ జరుగుతుండగా నడ్డా జోక్యం చేసుకొని ఈ వ్యాఖ్యలు చేశారు. నీట్ లేని రోజుల్లో వైద్య విద్యలో అవినీతి విచ్చలవిడిగా సాగేదన్నారు. పీజీ సీటు రూ.8 కోట్లకు అమ్ముడుపోయేదని, రేడియాలజీ వంటి విభాగంలో సీట్ల ధర రూ.12-13 కోట్లుగా ఉండేదని వెల్లడించారు. విద్యార్థులు దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి పరీక్ష రాయాల్సి వచ్చేదని అన్నారు. డబ్బు, సమయం వెచ్చించడంతో పాటు వైద్య విద్యా వ్యవస్థలోని అవినీతిని సైతం విద్యార్థులు ఎదుర్కోవాల్సి వచ్చేదని నడ్డా తెలిపారు. అడ్మిషన్ జాబితాను 30-45 నిమిషాల కోసం ఉంచేవారని, విద్యార్థులు రాలేదనేవారన్నారు. వైద్య విద్యలో సీట్లు అమ్మకానికిపెట్టి వ్యాపారంలా మార్చేసిన వ్యవహారం సుప్రీంకోర్టులో దీర్ఘకాలంగా నడుస్తోందని నడ్డా తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.